
ఆంధ్రజ్యోతి

****

ANDHRAJYOTHY



నల్లగొండ

5

ఆదివారం 23 నవంబరు 2025

అతివేగంతోనే అనర్థాలు

- బ్లాక్‌స్పాట్‌ల వద్ద రక్షణ చర్యలు కరువు
- ప్రమాదాలతో పదుల సంఖ్యలో కోల్పోతున్న ప్రాణాలు

6



పంచాయతీలకు రిజర్వేషన్ల

ఖరారు నేడు



గ్రామపంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం శనివారం జీవో జారీ చేసింది. వార్డు సభ్యులు, సర్పంచ్ పదవుల రిజర్వేషన్లకు విధివిధానాలను ఖరారు చేసింది. 50 శాతానికి మించకుండా రిజర్వేషన్లపై మార్గదర్శకాలు జారీ చేయడంతో రిజర్వేషన్ల ఖరారుకు అధికార యంత్రాంగం ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. జీవో జారీ అయిన వెంటనే అధికారులు రిజర్వేషన్ల పనుల్లో నిమగ్నమయ్యారు.

– (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

- 50శాతానికి మించకుండా రిజర్వేషన్లు
- జీవో నెంబర్ 46ను జారీ చేసిన ప్రభుత్వం
- రోటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు
- ఎన్నికల నిర్వహణను వేగవంతం చేసిన యంత్రాంగం

ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళ రిజర్వేషన్లను రోటేషన్ పద్ధతిలో అమలు చేయాలని ప్రభుత్వం జీవోలో పేర్కొంది. 100శాతం ఎస్టీలు ఉన్న గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలు అన్ని ఎస్టీలకే రిజర్వు అయ్యే అవకాశం ఉంది. వార్డు మెంబర్లకు 2024 కుల సర్వే ఆధారంగా, సర్పంచ్‌లకు 2011 జనాభా లెక్కల ఆధారంగా రిజర్వేషన్ కల్పించనున్నారు. జీవో 46 ప్రకారం రిజర్వేషన్లు ఖరారు కానున్నాయి. 2019లో జరిగిన ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించిన చోట ఆయా ప్రాంతాల్లో ఎన్నికల్లో జరగకపోతే వచ్చే ఎన్నికల్లో గతంలో చేసిన రిజర్వేషన్లను అమలు చేయనున్నారు. జనాభా ప్రాతిపాదికన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సర్పంచ్ పదవులను కేటాయిస్తారు. ఇక బీసీలకు ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ప్రయత్నాలు చేసినా, బ్రేక్ పడటంతో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 50శాతానికి మించకుండా రిజర్వేషన్లు కల్పించడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఎన్నికల్లో రిజర్వ్ చేసిన సర్పంచ్ పదవులకు సంబంధించి అదే కేటగిరీకి తిరిగి రిజర్వేషన్ చేసే అవకాశాలు లేవు. ఆయా ప్రాంతాల్లో రిజర్వేషన్లు మారనున్నాయి. ఎస్టీ రిజర్వేషన్లు మొదట ఖరారు చేసి, ఎస్సీ, బీసీలకు సంబంధించి రిజర్వేషన్లు కేటాయించనున్నారు. ప్రభుత్వం జీవో జారీ చేయడంతో ఎంపీడీవోలు, ఆర్డీవోలు ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేశారు. ఆదివారం రిజర్వేషన్లను ఖరారు చేయడంతో పాటు ప్రభుత్వానికి నివేదికను పంపించనున్నారు. ఈనెల 23న ఉదయం 10.30గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో మహిళ వార్డు సభ్యుల పదవులకు రిజర్వేషన్లను లాటరీ ద్వారా ఎంపిక చేయనుండగా మధ్యాహ్నం 1గంట సమయంలో ఆర్డీవో కార్యాలయంలో మహిళ సర్పంచ్ పదవులకు రిజర్వేషన్లను లాటరీ ద్వారా ఎంపిక చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

నాలుగు రోజుల్లో ఎన్నికల షెడ్యూల్?

పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం వేగవంతంగా చర్యలు చేపట్టడంతో పాటు జీవోలు సైతం జారీ చేయడంతో జిల్లాలో అధికార యంత్రాంగం ఎన్నికల పనుల్లో నిమగ్నమైంది. శనివారం రాత్రి లేదా ఆదివారం రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ ముగిసే అవకాశాలు ఉండటంతో మరో నాలుగు రోజుల్లో అంటే ఈనెల 26లోగా ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది.

డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఆధారంగా

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల కోసం డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం జీవో జారీ చేసిన నేపథ్యంలో రిజర్వేషన్లు ఖరారు అవుతున్నాయి. డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా బీసీ రిజర్వేషన్‌లు ఖరారు కానున్నాయి. ప్రభుత్వం గతంలో ఇచ్చిన జీవో ప్రకారం 42శాతం రిజర్వేషన్ అమలైతే పెద్ద సంఖ్యలో బీసీలకు పదవులు లభించి ఉండేవి. కానీ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 50శాతంలోపు రిజర్వేషన్ ఉండాలని స్పష్టం చేయడంతో డెడికేషన్ కమిషన్ ఆధారంగా బీసీల రిజర్వేషన్లు ఖరారు కానున్నాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం బీసీల రిజర్వేషన్‌లు ఎలా ఉండాలనే దానిపై మార్గదర్శకాలు జారీ చేసింది. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ పాత పద్ధతిలోనే 23శాతం చొప్పున సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు రిజర్వేషన్లను ఖరారు చేస్తోంది. దీంతో బీసీలకు రిజర్వేషన్లు తగ్గనున్నాయి. ప్రభుత్వపరంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయలేని పరిస్థితి ఉన్నందున పార్టీపరంగా బీసీలకు 42శాతం వరకు అవకాశం కల్పిస్తామని కాంగ్రెస్ గతంలో బీసీలకు హామీ ఇచ్చింది.మొత్తానికి సుప్రీంకోర్టు ఆదేశాలతో గ్రామపంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లు 50శాతం మించకుండా చూస్తున్నారు.

మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. డిసెంబరు 15లోపు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు సమాచారం. ఒక్కో ఎన్నికకు సంబంధించి ప్రతీ విడతలోనూ రెండు రోజుల వ్యవధి ఉండేలా ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు సమాచారం. ఎన్నికల నిర్వహణ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పోలీస్ యంత్రాంగం...

– మిగతా 8వ పేజీలో...

హస్తం జిల్లా పగ్గాలు కైలాష్‌కే

స్థానికం వేళ డీసీసీ అధ్యక్షుల ప్రకటన

- యాదాద్రికి అయిలయ్య, సూర్యాపేటకు గుడిపాటి నర్సయ్య



పున్న కైలాష్‌నేత



బీర్ల అయిలయ్య



గుడిపాటి నర్సయ్య

నల్లగొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధిష్టానం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులను శనివారం రాత్రి ప్రకటించింది. దీంతో కొన్ని రోజులుగా నెలకొన్న ఉత్కంఠకు తెర పడింది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ బలోపేతం కోసం డీసీసీ అధ్యక్షులను నియమించింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పున్న కైలాష్‌నేతను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ.వేణుగోపాల్ ప్రకటించారు. ప్రస్తుతం టీపీసీసీ అధికార ప్రతినిధిగా ఉన్న కైలాష్‌నేత గతంలో మునుగోడు అసెంబ్లీ నుంచి, భువనగిరి పార్లమెంట్ నుంచి టికెట్‌ను ఆశించారు. ఆరు నెలలుగా అధ్యక్ష పదవికి చాలా మంది పోటీపడుతూ రాగా, చివరికి బీర్లకు పదవి వరించింది. స్థానిక ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతం కోసం అధిష్టానం ఈ నిర్ణయం తీసుకుంది. యాదాద్రి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను ప్రకటించారు. సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా తుంగతుర్తి మండలం వెలుగుపల్లికి చెందిన గుడిపాటి నర్సయ్యను నియమించారు. ఆయన 2009లో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. 2001లో ఆయన జడ్పీటీసీగా గెలుపొందారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

7



వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

6

యువత ఇతర రంగాల్లోనూ రాణించాలి

అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్



యువజనోత్సవాల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): యువత చదువులోనే కాకుండా, సంస్కృతి, కళలు, సాహి త్యం, పెయింటింగ్ రంగాల్లో కూడా రాణించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. శనివారం కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి మెమోరియల్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన ఉత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సం దర్భంగా మాట్లాడుతూ, నేటి యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. యువత అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి అక్బర్ అలీ, కళాశాల ప్రిన్సిపాళ్లు ఉపేందర్, రాకేంద్, బొజ్జ అనిల్, మనిషా సింగ్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత నీరు అందించేందుకు చర్యలు



పర్యటన వివరాలు వెల్లడిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో ఏపీ రాష్ట్రం విశాఖపట్టణంలో డ్రింక్ ఫ్రం ట్యాప్ అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌నకు హాజరైనట్టు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగిన శిబిరంలో డ్రింక్ ఫ్రం ట్యాప్(డీఎఫ్‌టీ) విధాన అమలులో గ్రేటర్ వైజాగ్ మునిసిపల్ కార్పొరేషన్ సాధించిన పురోగతి, నీటి సరఫరా వ్యవస్థలను పరిశీలించినట్లు తెలిపారు. అమృత్-2 పథకం ద్వారా ప్రజలకు 24గంటలు నీటిని అందించడం, నల్లాల ద్వారా సరఫరా అయ్యే నీరు నేరుగా తాగేందుకు అవసరమైన వ్యవస్థను ఏర్పాటు చేయడమే వర్క్‌షాపు ప్రధాన ఉద్దేశమన్నారు. పట్టణంలో డీఎఫ్‌టీ విధానం అమలుకు చర్యలు చేపట్టామని, పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనడం అశాస్త్రీయం

టీఆర్‌జీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు రవినాయక్



సమావేశంలో మాట్లాడుతున్న టీఆర్‌జీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు రవినాయక్

మిర్యాలగూడ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలనడం అశాస్త్రీయమని తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రవినాయక్ అన్నారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గిరిజన తెగల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టేందుకు కొందరు ప్రయత్నించడం క్షమించరానిదని అన్నారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే డిమాండ్ రాజ్యాంగ విరుద్ధమన్నారు.

గిరిజన చైతన్య యాత్రలు నిర్వహించి ప్రజలకు ఈ విషయాలను వివరించేందుకు భవిష్యత్‌లో చేపట్టే కార్యక్రమాలపై ఈ నెల 29న రాష్ట్ర కమిటీ సమావేశంలో చర్చించనున్నట్టు తెలిపారు. నల్లగొండలోని లెక్చరర్స్ భవన్‌లో నిర్వహించనున్న రాష్ట్ర కమిటీ సమావేశంలో టీఆర్‌జీఎస్ క్రియాశీలక కార్యకర్తలందరూ పాల్గొనాలని కోరారు. సమావేశంలో గిరిజన సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీను నాయక్, నాయకులు రమేష్ నాయక్, అశోక్‌నాయక్, శ్రీనునాయక్, సైదానాయక్, నాగానాయక్, వస్రాంనాయక్ పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు రైస్ మిల్లులు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



మహిళా శక్తి చీరలను పంపిణీ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో మహిళల కోసం ఉచిత బస్సు సౌకర్యం, బస్సులు, పెట్రోల్ బం కులు, మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణను అప్పగించిందని, వారికి రైస్ మిల్లులు నిర్వహించే బాధ్యతలు కూడా అప్పగించాలని యోచిస్తున్నట్టు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో ఇందిర మహిళా శక్తి చీరల పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పైలెట్ పద్ధతిన జిల్లాలో మహిళలతో రైస్ మిల్లులు ఏర్పాటు చేయిస్తామన్నారు. వీటిని ఆర్‌అండ్‌బీశాఖ ద్వారా నిర్మిస్తామన్నారు. దీంతో జిల్లాలో రైస్ మిల్లుల కొరతను తీరుస్తామన్నారు. మిల్లుల ఏర్పాటుకు స్థలాలు చూడాలని కలెక్టర్‌ను ఆదేశించా రు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లి వచ్చే క్యాబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. మహిళలు స్వయంకృషితో పైకి వచ్చేందుకు పెట్రోల్ పంపులు కేటాయించామన్నారు. జిల్లా లో రద్దీ ప్రాంతంలో ఎస్ఎల్‌బీసీలో ఏర్పాటు చేసిన పెట్రోల్ పంపు ద్వారా ప్రతీ నెల రూ.10లక్షల ఆదాయం పొందే అవకాశం కల్పించామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళల ఆత్మగౌరానికి పెద్దపీట వేసిందన్నారు. సీఎంతోపాటు మంత్రివర్గం చర్చించి నాణ్యమైన చీరలు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రస్తుతం జిల్లాకు 65లక్షల చీరలు వచ్చాయని, మరో 35లక్షలు రాగానే మహిళలకు పంపిణీ చేస్తామన్నారు. మహిళలు పిల్లలను బాగా చదివించాలని సూచించారు. కుట్టుమిషన్ శిక్షణ ఇచ్చేందుకు, ఇతర నైపుణ్యాల అభివృద్ధి కోసం న్యాక్ ద్వారా భవనాన్ని నిర్మిస్తున్నామని, త్వరలోనే పనులు పూర్తయితాయని తెలిపారు. వచ్చే మూడేళ్లలో నియోజకవర్గంలో 10వేల ఇళ్ల కట్టించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రూ.400కోట్లతో జిల్లాలో డబుల్ రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందని, అందులో బాగానే నాణ్యమైన చీరలు పంపిణీ చేస్తోందన్నారు. అనంతరం మంత్రి రూ.2.20కోట్ల విలువచేసే కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ హఫీజ్‌ఖాన్, ఇన్‌చార్జీ డీఆర్వో అశోక్‌రెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మాధవి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూపూడి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ సంపత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లకు ఇబ్బందులు రాకుండా చర్యలు

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ): అభివృద్ధి పనులను పూర్తిచేసిన కాంట్రాక్టర్లకు ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. చిన్న కాంట్రాక్టర్లకు మంత్రి కోమటిరెడ్డి కృషితో బిల్లులు మంజూరవడంతో శనివారం కాంట్రాక్టర్స్ క్లాస్ థర్డ్ అసోసియేషన్ నాయకులు ఆయన్ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కాంట్రాక్టర్లకు సమస్యలు రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో క్లాస్ థర్డ్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కాకోల రామలింగయ్య, కార్యదర్శి పోతేపాక చంద్రశేఖర్, ఉపాధ్యాక్షులు ఓర్సు ఇద్దయ్య, బొంత ఎల్లయ్య, కార్యదర్శి ఓర్సు కల్యాణ్, ఉప కార్యదర్శి మహ్మద్ జానీ, సభ్యులు ఆలకుంట్ల నాగరాజు, వేముల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ ప్రసన్నకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

నల్లగొండ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, అందుకు 50శాతం పరిమితిని ఎత్తివేయాలని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ మునాసు ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. శనివారం బీసీ జేఏసీ జిల్లా కార్యాలయంలో వివిధ కులసంఘాలు, రాజకీయ పార్టీల నేతలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి వచ్చే పార్లమెంట్ సమావేశంలో బీసీ బిల్లు, తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. వాటిని సాధించేంతవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యాక ఎన్నికలను నిలపవద్దని గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయని, దానికి విరుద్ధంగా వాయిదా వేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. ఈ నిర్ణయింతో రాష్ట్రంలోని 56శాతం బీసీ ప్రజల హక్కులకు విఘాతం కలిగిస్తోందన్నారు. దుడుకు లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు చీర పంకజ్‌యాదవ్, కొలగాని పర్వతాలు, గుంటోజు వెంకటాచారి, చిలకరాజు చెన్నయ్య, మిర్యాల యాదగిరి, అయితగోని జనార్ధన్‌గౌడ్, అబ్దుల్ ఖదీర్, గజ్జి అజయ్‌యాదవ్, మార్గం సతీష్, చిలకరాజు సతీష్‌కుమార్, వడ్డెబోయిన రామకృష్ణ, చెన్నూరి భరద్వాజ్ యాదవ్, అనంత నాగరాజుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్‌పై విచారణ చేయించాలి



నల్ల బ్యానర్‌తో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

నల్లగొండ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను నిరసిస్తూ శనివారం జిల్లా కేంద్రంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద నల్ల బ్యానర్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దేశంలో బీజేపీ మోదీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టు నేత హిడ్మా సహా ఆరుగురిని ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపారన్నారు. ఈ ఎన్‌కౌంటర్లన్నీ బూటకమని వీటిపై న్యాయవిచారణ చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు సాగర్, సీహెచ్.సుధాకర్‌రెడ్డి, పన్నాల గోపాల్ రెడ్డి, పాలడుగు నాగార్జున, పందుల సైదులు, బొంగరాల నర్సింహ, బొమ్మిడి నగేష్, ఎండీ. సలీం, అవుట రవీందర్, బీవీ.చారి, మల్లం మహేష్, విజయ్‌కుమార్, పాల్గొన్నారు.

బొమ్మ పడితేనే.. బులుగు చీర!

- చీర పొందాలంటే ఫొటో దిగాల్సిందే
- సెర్ప్ ప్రొఫైల్ యాప్‌లో నమోదవ్వాల్సిందే
- ఇందిర మహిళా శక్తి చీరల పంపిణీకి నిబంధన
- యాప్ సర్వర్ సమస్య ఎదురవుతుందనే సందేహం?



నార్కట్‌పల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): యూనిఫాం పేరుతో పొదుపు సంఘాల మహిళలకు ప్రభుత్వం అందజేస్తున్న ఇందిరా మహిళా శక్తి (నీలి రంగు) చీరల పంపిణీకి ఫొటో దిగాలనే నిబంధన విధించింది. చీరల పంపిణీలో పారదర్శకత కోసమే ఈ నిబంధన పెట్టినట్లు అధికారులు చెబుతున్నారు. అందుకోసం ఓ యాప్‌ను కూడా రూపొందించారు. పొదుపు సంఘాల మహిళలు ప్రభుత్వం అందజేసే చీరను పొందాలంటే కచ్చితంగా వీవోఏల వద్ద ఉండే మొబైల్ ఫోన్‌లోని యాప్‌లో ఫొటో నమోదవ్వాల్సి ఉంది. ఈ నిబంధన ప్రకారమే చీరను పొందే అవకాశముంది. లేదంటే చీర పొందడం కుదరదు.

జిల్లా వ్యాప్తంగా 4,24,400 చీరల పంపిణీ

జిల్లా వ్యాప్తంగా 33 మండలాలకు చెందిన పొదుపు మహిళలు, పొదుపు సంఘాల్లో లేని మహిళలు కలిపి సుమారు 4,24,400 మందికి ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేసేందుకు డీఆర్‌డీఏ అధికారులు ఇప్పటికే జాబితా సిద్ధం చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చింతపల్లి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మిర్యాలగూడలోని గోదాములను స్టాక్ పాయింట్‌లుగా చీరలను నిల్వచేశారు. స్టాక్ పాయింట్ల వారీగా కేటాయించిన మండలాలకు చీరల చేరవేత దాదాపు పూర్తికావొచ్చింది. మిర్యాలగూడ స్టాక్ పాయింట్ పరిధిలోని 13 మండలాలకు 1,59,500 చీరలు, చింతపల్లి స్టాక్ పాయింట్ పరిధిలో ఉన్న 20 మండలాలకు 2,64,900 కలిపి మొత్తం జిల్లాలో 4,24,400 చీరలను పంపిణీ చేయనున్నారు.

సెర్ప్ ప్రొఫైల్ యాప్

ఇందిరా మహిళా శక్తి చీరలను...

మిగతా 8వ పేజీలో...

మైనర్‌పై మాజీ ప్రజాప్రతినిధి లైంగికదాడికి యత్నం

తిప్పర్తి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో ఓ మైనర్‌పై మాజీ ప్రజాప్రతినిధి లైంగిక దాడికి యత్నించాడు. గ్రామానికి చెందిన బాలిక శుక్రవారం సాయంత్రం తన ఇంటి ముందు ఆడుకుంటున్న సమయంలో తన ఇంటి పక్కనే ఉన్న మాజీ ప్రజాప్రతినిధి బాలికను ఇంట్లోకి తీసుకెళ్లి నోరు మూసి లైంగిక దాడికి యత్నించాడు. దీంతో భయాందోళనకు గురైన బాలిక గట్టిగ కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకోవడంతో అక్కడి నుంచి వెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈవిషయమై ఎస్‌ఐ శంకర్‌ని వివరణ కోరగా బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెఎలిపారు. మైనర్ కావడంతో కేసులకు భయపడి కుటుంబసభ్యులు ముందుకురావడం లేదని గ్రామస్థులు తెలిపారు.

క్షుద్రపూజల కలకలం


క్షుద్రపూజలకు ఉపయోగించిన వస్తువులు

భువనగిరి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం హుస్సేనాబాద్‌లో క్షుద్రపూజలు కలకలం సృష్టించాయి. బస్వాపురం రిజర్వాయర్ నిర్మాణంలో ముంపు గ్రామం బీఎన్‌తిమ్మాపూర్‌కు చెందిన మొలుగూరి గణేశ్‌కు భువనగిరి శివారులోని హుస్సేనాబాద్‌లో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద 107 సర్వే నెంబర్‌లో 543 ప్లాట్ నెంబర్‌ను కేటాయించారు. ఆ స్థలంలో గణేష్ నూతన ఇంటిని నిర్మిస్తున్నాడు. ఈ నెల 20న గురువారం అమావాస్య రాత్రి వేళ గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి స్లాబ్ కింద పూజలు నిర్వహించారు. శనివారం గణేష్ అక్కడికి వెళ్లగా అక్కడ క్షుద్రపూజలు చేసినట్లు అనుమానించి పోలీసులకు ఫిర్యాదుచేశాడు. విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

గంజాయితో పట్టుబడ్డ వ్యక్తికి రిమాండ్

తుర్కపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలో గంజాయితో పట్టుబడ్డ వ్యక్తిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ తక్యుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం బీబీనగర్ మండలం బట్టుగూడెం గ్రామానికి చెందిన పార్వతి లాలీ శనివారం ఉదయం ద్విచక్రవాహనంపై గంజాయిని తరలిస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. ఎస్‌ఐ తక్యుద్దీన్ తన సిబ్బందితో తుర్కపల్లి గ్రామ శివారులో తనిఖీ చేపట్టారు. పార్వతి లాలీ వద్ద ఒక కవర్లో సుమారు 100గ్రాముల గంజాయి లభించింది. గంజాయిని ఉప్పల్ నుంచి సిద్ధిపేట జిల్లా కొమురవెల్లిలో విక్రయించేందుకు తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. గంజాయితోపాటు సెల్‌ఫోన్, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నందుకు భువనగిరి డీసీపీ అక్షాంశ్‌యాదవ్, యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాస్‌నాయుడులు ఎస్‌ఐ తక్యుద్దీన్, పోలీస్‌లు శివ, మీరా, రవి, స్వామి, ప్రదీప్‌లను అభినందించారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై దాడి


దాడిలో గాయపడ్డ ప్రియాంక

మేళ్లచెర్వు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో అంగన్‌వాడీ కార్యకర్తలపై దాడి కేసులో ఓ వ్యక్తిపై కేసు నమోదైంది. ఎస్‌ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం పాతకక్షల నేపథ్యంలో మండలకేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రం-4లో విధులు నిర్వహిస్తున్న ప్రియాంకపై సమీప బంధువు బుసా రామారావు కత్తి పీటతో శనివారం ఉదయం దాడి చేశాడు. దాడిలో గాయపడిన ప్రియాంకను స్థానికులు, కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనపై ప్రియాంక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పరమేష్ తెలిపారు.

తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు



దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లో దొంగతనాల వివరాలను వెల్లడిస్తున్న సీఐ వెంకట్‌రెడ్డి

దేవరకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇళ్లు లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని నల్లగొండ జిల్లా దేవరకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులత సమావేశంలో సీఐ వెంకట్‌రెడ్డి వెల్లడించారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం వింజమూరు గ్రామానికి చెందిన పగిళ్ల శివ ప్రస్తుతం హైదరాబాద్‌లోని కర్మన్‌ఘట్‌లో ఉంటు దొంగతనాలకు పాల్పడుతున్నాడు. 10వ తరగతి వరకు చదివిన శివ 14 ఏళ్ల వయస్సు నుంచి దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. ఎన్నోసార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని పగటిపూట రెక్కీ నిర్వహించి రాత్రివేళలో చోరీలకు పాల్పడేవాడు. ఈ నెల 11న దేవరకొండ పట్టణంలోని అయ్యప్పనగర్‌కు చెందిన జబ్బార్ ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో బీరువాలోని రూ.8లక్షల నగదును అపహరించాడు. జబ్బార్ దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని ప్రత్యేక పోలీస్ టీంను నియమించి నిందితుడి కోసం గాలిస్తున్నారు. శనివారం హైదరాబాద్ నుంచి దేవరకొండకు దొంగతనం చేసేందుకు వచ్చి రెక్కీ నిర్వహిస్తున్న శివను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో జబ్బార్ ఇంట్లో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. దొంగిలించిన సొమ్ముతో కంప్యూటర్ కొనుగోలు చేయగా మరికొంత డబ్బును జల్సాలకు వాడుకున్నాడు. నిందితుడి నుంచి రూ.3.68లక్షల నగదు, ఒక మానిటర్, సీపీయూ, ఐదు గ్రాముల బంగారం(చెవి పోగులను) స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కేసును ఛేదించిన దేవరకొండ ఎస్‌ఐలు నారాయణరెడ్డి, రాజు, కానిస్టేబుల్ సతీష్, అంజయ్య, చాంద్‌పాష, హరిబాబు, సింహాద్రి, చంద్రమౌళి, యాదయ్యలను ఎస్పీ అభినందించినట్లు సీఐ తెలిపారు.

వివాదాస్పదంగా మారిన చేపల పట్టివేత


పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న మత్స్యకార్మికులు

హుజూర్‌నగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని అలకశంకర్‌కుంట చెరువులో శనివారం వ్యాపారులు చేపట్టడం వివాదాలకు దారితీసింది. కమిటీ సభ్యులకు తెలియకుండా సంఘంలోని కొంతమంది వ్యాపారులతో కుమ్మక్కై చేపలు పట్టడాన్ని అడ్డుకుని మత్స్యకార్మికులు వ్యాపారులను పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. కాగా పట్టణంలోని 5 చెరువులకు సంబంధించి సుమారు 520 సభ్యులు ఉన్నారు. ఇందులో 12మందితో కమిటీ ఏర్పాటుచేశారు. కాగా సభ్యులకు తెలియకుండా, మత్స్యకార్మికులకు చెప్పకుండా అలకశంకర్‌కుంట(బండచెరువు) చెరువులో వ్యాపారులతో కుమ్మక్కై వ్యాపారులు చేపలు పడుతున్నారు. దీంతో వ్యాపారులను అడ్డుకుని పోలీసులకు అప్పగించి మత్స్యకార్మికులు తమను మోసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మత్స్య కార్మికులు మాట్లాడుతూ సంఘంలోని నలుగురు వ్యక్తులు కమిటీ సభ్యులకు తెలియకుండా చేపలను విక్రయిస్తూ మోసం చేస్తున్నారని ఆరోపించారు. సభ్యత్వం పేరుతో సభ్యుల నుంచి రూ.2000లు వసూలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు తీసుకొని రెండేళ్లు దాటినా సభ్యత్వాలు ఇవ్వలేదని ఆరోపించారు. చేపలు విక్రయించేందుకు వ్యాపారుల వద్ద నుంచి అక్రమంగా డబ్బులు తీసుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో కృష్ణ, నరేష్, సైదులు, శివ, నాగేంద్రబాబు, కె.శ్రీనివాస్, శంభయ్య, వెంకయ్య, రాంబాబు, నాగరాజు, పిచ్చయ్య, శ్రీనివాస్, వెంకన్న, సాయి, కార్తీక్, శీతయ్య తదితరులు పాల్గొన్నారు.

అతివేగంతోనే అనర్థాలు

● బ్లాక్‌స్పాట్‌ల వద్ద చేపట్టని రక్షణ చర్యలు ● ప్రమాదాలతో పదుల సంఖ్యలో కోల్పోతున్న ప్రాణాలు

రోడ్డు ప్రమాదాల్లో అత్యంత వేగం క్రియాశీలకంగా మారుతోంది. అతివేగంతో నడుపుతూ మరణించిన వారిలో 80 శాతం మంది 20 నుంచి 35 ఏళ్ల లోపు వారే. నిత్యం ఏదో ఓ చోట ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించి రోడ్లు రక్తసిక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అతి ఎక్కువగా ప్రమాదాలు జరిగే స్థలాలను బ్లాక్‌స్పాట్స్‌గా గుర్తించి పోలీస్‌శాఖ, హైవే అధికారులు ప్రత్యేక రక్షణ చర్యలు చర్యలు చేపడుతున్నారు. వీటితో ప్రమాదాలు తగ్గుముఖం పడుతున్నాయని అధికారులు చెబుతున్నా మరింత అవగాహన పెంచాల్సి ఉంది.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

నల్లగొండ జిల్లా నుంచి ఐదు జాతీయ రహదారులు, మూడు స్టేట్ హైవేలు కొనసాగుతున్నాయి. వీటన్నింటిని కలిపి 468 కిలోమీటర్ల మేర హైవేలు విస్తరించి ఉన్నాయి. ఇవి కాక పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్లు 1,450 కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉన్నాయి.

మిర్యాలగూడలో రోడ్‌టెర్రర్

నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై మిర్యాలగూడ డివిజన్‌లో నాలుగు చోట్ల బ్లాక్‌స్పాట్స్ ఉన్నట్లు గుర్తించారు. నందిపాడు జంక్షన్ వద్ద మూడేళ్ల నుంచి ఇప్పటి వరకు 23 ప్రమాదాలు జరగ్గా ఆరుగురు చనిపోగా 23 మంది గాయపడ్డారు. ఈదులగూడెం వై జంక్షన్‌లో 20 ప్రమాదాల్లో ఐదుగురు మరణించగా 17 మంది గాయపడ్డారు. గూడూరు వద్ద 17 ప్రమాదాలు జరగ్గా 10 మంది చనిపోగా 16 మంది క్షతగాత్రులయ్యారు. దామరచర్ల వద్ద 27 ప్రమాదాలు జరగగా 11 మంది చనిపోగా 24 మంది గాయపడ్డారు. వాడపల్లి వద్ద 10 రోడ్డు ప్రమాదాల్లో నలుగురు చనిపోగా ఏడుగురు క్షతగాత్రులయ్యారు.

ప్రధానరహదారి	విస్తీర్ణం (కిలోమీటర్లు)
హైదరాబాద్-విజయవాడ	63
జడ్చర్ల-కోదాడ	159
నకిరేకల్-అర్వపల్లి	22
నకిరేకల్-నాగార్జునసాగర్	85
డిండి-శ్రీశైలం	3
నార్కట్‌పల్లి-అద్దంకి	86
మాల్-నాగార్జునసాగర్	91
నల్లగొండ-మల్లేపల్లి	53

నామమాత్రంగా రక్షణ చర్యలు

హైవే అథారిటీ అధికారులు బ్లాక్‌స్పాట్‌ల వద్ద వాహనాల వేగనియంత్రణకు సంబంధించి సరైన రక్షణ చర్యలు చేపట్టకపోవడం వల్లే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. క్రాసింగ్ రోడ్డుకు అత్యంత చేరువలో స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేస్తుండటంతో భారీ వాహనాలు అత్యంత సమీపంలో వాహనవేగాన్ని తగ్గించలేక జంక్షన్‌పైకి చేరి ప్రమాదాలకు కారణం అవుతున్నట్లు చెబుతున్నారు. పాదాచారులు రోడ్డుదాటే ప్రాంతంలో జీబ్రాలైన్స్ ఏర్పాటు చేయకపోవడం, బ్లింకర్ లైట్లు లేకపోవడం, చాలాచోట్ల ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు అధికారులు అంచనావేస్తున్నారు. జంక్షన్‌ల వద్ద సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయకపోవడం ప్రమాదాలకు హేతువుగా మారుతోంది. స్పీడ్‌గన్స్, సీసీ కెమెరాలతో మానిటరింగ్ చేసి వేగం దాటిన వాహనాలకు జరిమానా విధిస్తూ వాహనదారుల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగించేలా కార్యాక్రమాలు చేపట్టాల్సివుంది.

ఏడాది	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2023	880	399	829
2024	907	390	807
2025	778	296	658
(ఇప్పటి వరకు)			


మిర్యాలగూడ మండలం గూడూరు వద్ద ఇటీవల జరిగిన ప్రమాదంలో తుక్కుగా మారిన అంబులెన్స్, ట్యాంకర్(ఫైల్)

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కళాజాత

రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రహదారుల పక్కనున్న గ్రామాల్లో గ్రామీణ రోడ్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటుచేసి వారి ద్వారా స్థానిక ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టారు. కళాజాతల ద్వారా 109 గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 80 గ్రామాల్లో కార్యక్రమాలు పూర్తి చేయగా, మరో 29 గ్రామాల్లో కళాజాతలు నిర్వహించాల్సి ఉంది.

కౌలు రైతుకు కన్నీళ్లే దిగుబడి

● వర్షాలతో దెబ్బతిన్న పంటలు
● తగ్గిన దిగుబడులతో తీరని నష్టం

వానాకాలం సీజన్ కౌలు రైతులకు పుట్టెడు కష్టాలను తెచ్చిపెట్టింది. సాగు పెట్టుబడులతో పాటు కౌలు ధరలు పెరగడం, ప్రభుత్వ పథకాలు వర్తించక నష్టపోతున్నారు. ఈ సీజన్‌లో వరుసగా కురిసిన భారీ వర్షాలు పంటలపై తీవ్ర ప్రభావం చూపాయి. దిగుబడులు గణనీయంగా తగ్గడంతో కౌలు రైతులు కుదేలయ్యారు. ఎకరాకు 40 బస్తాలు వచ్చే పంట 20 కూడా రాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ పథకాలు వర్తించేలా కౌలు రైతుల గుర్తింపు కోసం చేపడతామని సర్వే ఊసే లేకుండాపోయింది. వెరసి అటు ప్రకృతి ప్రకోపానికి, ఇటు ప్రభుత్వ నిర్లక్ష్యం మధ్య రైతులు నలిగిపోతున్నారు.

(ఆంధ్రజ్యోతి-మఠంపల్లి)

మఠంపల్లి మండల వ్యాప్తంగా సుమారు 40 వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ఇందులో 31 వేల ఎకరాల్లో వరి, 4,420 ఎకరాల్లో పత్తి. 1,530 ఎకరాల్లో మిరప, సుమారు 3వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో 1100 మంది కౌలు రైతులు ఉన్నారు. ఏటా పెద్దసంఖ్యలో భూములు కౌలు తీసుకొని వివిధ పంటలు సాగిచేస్తున్నారు. వరిసాగు చేసే అన్నదాతలకు ప్రభుత్వం సన్నరకం ధాన్యంపై రూ.500 బోనస్ ప్రకటించడంతో కౌలు ధరలు ఆకాశాన్ని తాకాయి. ఎకరాకు రూ.20వేల వరకు కౌలు చెల్లించాల్సి వస్తోంది. గతంలో మండలంలో కౌలు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు పలకగా బోనస్ కారణంగా కౌలు ధరలకు రెక్కలొచ్చాయి. పంట దిగుబడితో సంబంధం లేకుండా రైతులు కౌలు చెల్లించాల్సి వస్తోంది. ఏటేటా ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు నష్టపోయి దిగుబడి తగ్గుతుండడంతో ఆందోళన చెందుతున్నారు.



అందని ప్రభుత్వ పథకాలు

కౌలుకు భూములు తీసుకొని సాగుచేసే రైతులకు ప్రభుత్వం అందించే ఏ పథకాలూ అందడం లేదు. సాగుకు బ్యాంకులో రుణాలు ఇవ్వడంలేదు. రైతుబంధు, రైతు బీమా, యాంత్రీకరణ పథకాలు కూడా వారి వర్తించడం లేదు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయిన సందర్భంలో వారికి పరిహారం కూడా రాని పరిస్థితి. గతంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు కూడా ప్రకటించారు. కానీ ఇప్పటికీ ఆ ఊసే లేదు. దీంతో కౌలు రైతులు అన్ని పథకాలకు దూరమవుతున్నారు.

దెబ్బతీసిన వర్షాలు

వానాకాలం సీజన్ మొదట్లో వర్షాలు కురవక రైతులు ఆందోళన చెందారు. ఆ తర్వాత పంట చేతికొచ్చిన దశలో భారీ వర్షాలకు చాలాచోట్ల పెద్దసంఖ్యలో వరి పంట నేలవాలింది. వర్షానికి పత్తి మెత్తబడి రంగు మారింది. వరి కోతలకు, పత్తి ఏరేందుకు అదనంగా రైతులు చెల్లించాల్సి వచ్చింది. ఇది కౌలు రైతులకు అదనపు భారంగా మారింది. వెరసి దిగుబడితో వచ్చే రాబడి కంటే వాటి కోసం చేస్తున్న ఖర్చులు పెరిగిపోయాయి. దీంతో కౌలు రైతులకు నష్టాల కన్నీళ్లు మిగిలాయి.

పెట్టుబడి కూడా రాలేదు



ఈ ఏడాది నాలుగు ఎకరాలు కౌలు తీసుకుని పత్తి సాగు చేశా. ఎకరానికి రూ.15 వేల నుంచి రూ.20వేలవరకు కౌలు చెల్లిస్తున్నా. ఎకరానికి 10క్వింటాళ్లకు పైగా దిగుబడి రావాల్సి ఉంది. కానీ వర్షాలకు పంట దెబ్బతిని కేవలం ఐదు క్వింటాళ్లలోపే దిగుబడి వచ్చింది. దీంతో పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఉంది.

\- బండారు బాబు, మండల వాసి

వర్షాలతో తగ్గిన దిగుబడి

కౌలుకు తీసుకున్న భూమిలో పత్తి సాగు చేశా. ఇటీవల వర్షాలకు పంట పూర్తిగా దెబ్బతింది. వర్షాలకు పంట తెగుళ్ల బారిన పడింది. దీంతో దిగుబడులు తగ్గి పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకుని భరోసా అందించేందుకు చర్యలు తీసుకోవాలి.

ఎర్రెద్దుల సైదిరెడ్డి, రఘునాథపాలెం

అమ్మా నేను చనిపోతున్నా..

● తల్లికి ఫోన్‌చేసి కుమారుడి ఆత్మహత్య

నార్కట్‌పల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అమ్మా నేను చనిపోతున్నా అని వేరే ఊర్లో ఉన్న తన తల్లికి ఫోన్ చేసి చెప్పి మరీ ఓ కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలకేంద్రంలో శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నకిరేకల్‌లో నివాసముండే గడ్డం శంకర్(35) క్షౌరవృత్తి చేస్తూ జీవిస్తున్నాడు. ఆర్థికసమస్యలతో ఇంట్లో తరుచూ భార్యభర్తల మధ్య గొడవలు జరిగేవి. ఈ కారణంగానే రెండు రోజుల క్రితం నార్కట్‌పల్లిలో ఉండే తన తల్లి గడ్డం అనసూర్య ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో అనసూర్య హైదరాబాద్‌కు వెళ్లింది. రెండు రోజుల తర్వాత వచ్చి అన్ని సమస్యలు మాట్లాడుకుందామని అంతవరకు ఇంట్లో ప్రశాంతంగా ఉండమని తల్లి సర్ది చెప్పింది. అయినా తల్లిమాట వినకుండా శుక్రవారం రాత్రి తల్లి అనసూయకు ఫోన్ చేసి నేను ఉరివేసుకుని చనిపోతున్నానని చెప్పాడు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. దీంతో వెంటనే ఆమె తమ సమీప బంధువులకు చెప్పింది. వారు వచ్చి తలుపులు తెరిచి చూసే సరికే ఉరివేసుకుని శంకర్ చనిపోయాడు. తల్లి అనసూర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత


వలిగొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా శనివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మండలకేంద్రంలోని మూసీ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో తనిఖీలు చేశామన్నారు. ఆంజనేయులు, అశోక్‌కు చెందిన రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టుకుని, సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగేందర్‌గౌడ్ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి


కౌశిక్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చిట్యాల రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-విజయవాడ రహదారిపై నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలో అదుపు తప్పిన ద్విచక్ర వాహనదారుడు చెట్టుకు ఢీకొని మృతి చెందాడు. ఎస్‌ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ పట్టణానికి చెందిన నకిరేకంటి కౌశిక్(21) ద్విచక్రవాహనంపై వేకువజామున ఐదు గంటలకు హైదరాబాద్ నుంచి మిర్యాలగూడకు బయలుదేరాడు. మార్గమధ్యలో గుండ్రాంపల్లి శివారులోకి చేరుకోగానే శ్రీపతి ల్యాబ్ సమీపంలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న చెట్టును ఢీకొని కిందపడిపోయాడు. తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. కౌశిక్ తల్లి నకిరేకంటి సంతోష్‌కుమారి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దశదినకర్మకు వచ్చి వెళ్తుండగా...


సైదులు(ఫైల్)

కట్టంగూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం ఎరసానిగూడెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందారు. ఎస్‌ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం మాడ్గులపల్లి మండలం కల్వలపాలెం గ్రామానికి చెందిన చిట్లంకి సైదులు(40) ఆటో మెకానిక్‌గా మిర్యాలగూడలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సైదులు ద్విచక్ర వాహనంపై భార్య సరితతో కలిసి స్వగ్రామం నుంచి కట్టంగూరు మండలం ఇస్మాయిల్‌పల్లి గ్రామంలో బంధువుల దశదినకర్మలో పాల్గొన్నాడు. కార్యక్రమం ముగించుకొని సాయంత్రం ద్విచక్రవాహనంపై భార్యతో స్వగ్రామానికి వస్తున్నాడు. మార్గమధ్యలో విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఎరసానిగూడెం స్టేజీ వద్ద డివైడర్ క్రాస్ చేస్తుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు డ్రైవర్ అతివేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సైదులును బంధువులు నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. సైదులు తల్లి యశోద ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రవీందర్ తెలిపారు.

డీసీఎంను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

నార్కట్‌పల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్వల్ప మరమ్మతుల కోసం రోడ్డుపై ఆగిన డీసీఎంను వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎం డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని నల్లగొండ ఫ్లైఓవర్ బ్రిడ్జిపై శనివారం తెల్లవారుజామున జరిగింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.


డీసీఎంను ఢీకొని దెబ్బతిన్న బస్సు

సిమెంట్ పలకలతో లోడుతో నల్లగొండ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న డీసీఎం నార్కట్‌పల్లిలోని ఫ్లైఓవర్‌పైకి చేరుకోగానే టైర్ పంక్చర్ అయ్యింది. దీంతో డీసీఎం డ్రైవర్ తమ్మిచెట్టు యాదగిరి వెంటనే డీసీఎంను పక్కకు నిలిపి టైర్ మార్చే పనిని చేస్తున్నాడు. అదే సమయంలో హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు డీసీఎంను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో యాదగిరికి గాయాలయ్యాయి. ప్రమాద ధాటికి డీసీఎంలో ఉన్న పలకలు ధ్వంసమయ్యాయి. కాగా బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. వారందరినీ మరో బస్సులో తరలించారు. బాధితుడు డీసీఎం డ్రైవర్ యాదగిరి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో కాల్వలో ఆటో డ్రైవర్ మృతి


కాల్వలో శీనయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చిట్యాల రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆటోతో సహా కాల్వలో పడి ఆటో డ్రైవర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తిలో జరిగింది. స్థానికులు, ఎస్‌ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం చిట్యాల మండలం పేరేపల్లికి చెందిన దివ్యాంగుడు అంతటి శీనయ్య అలియాస్ రవి(39) ఆటో నడుపుకుంటూ జీవనంకొనసాగిస్తున్నాడు. ఐదు రోజుల క్రితం బతుకుదెరువు కోసం శీనయ్య తన భార్య, పిల్లలతో కలిసి అత్తవారిలైన చండూరు మండం బంగారిగడ్డకు వెళ్లి అక్కడే ఇంటిని అద్దెకు తీసుకుని ఆటో నడుపుకుంటున్నాడు. మునుగోడుకు ఆటో కిరాయికి వెళ్తున్నానని భార్య రజితకు చెప్పి శుక్రవారం ఇంటి నుంచి బయలుదేరాడు. భర్త ఇంటికి రాకపోవడంతో శీనయ్య భార్య అత్తకు, తోటికోడలైన విజయకు ఫోన్‌చేసి అడిగింది. శనివారం పెద్దకాపర్తి వద్ద ఉరుమడ్లకు వెళ్లే పిల్లాయిపల్లి కాల్వలో ఆటో పడి వ్యక్తి మృతి చెందాడనే సమాచారం తెలుసుకున్న శీనయ్య సోదరుడు నర్సింహ ఘటనాస్థలానికి చేరుకుని చూశాడు. మృతుడు తన సోదరుడిగా నిర్ధారించుకున్నాడు. శ్రీనయ్య తలకు, నుదిటిపైన బలమైన గాయాలై మృతి చెందాడని శీనయ్య భార్య రజితకు సమాచారమిచ్చాడు. రవికి భార్యతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు. భర్త మృతిపై అనుమానం ఉందని రజిత ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కురంపల్లిలో...


నరేష్(ఫైల్)

కనగల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని కురంపల్లి గ్రామంలో అనుమానాస్పద రీతిలో వ్యక్తి మృతి చెందారు. ఎస్‌ఐ రాజీవ్‌రెడ్డి, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కురంపల్లి గ్రామానికి చెందిన వల్కి నరేష్‌కుమార్(29) రెండు వారాల కిందట చెరుకు తోటల్లో పనికోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వలసవెళ్లాడు. అయితే అనారోగ్యం బారిన పడిన అతను గురువారం స్వగ్రామానికి వచ్చాడు. శుక్రవారం ఉదయం నల్లగొండలోని ఆసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించుకుని అవసరమైన ఔషధాలు తెచ్చుకున్నాడు. రాత్రి భోజనానికి ముందు వాంతులు చేసుకున్నాడు. ముక్కు నుంచి నురుగ రావటంతో ఇరుగు పొరుగు వారు, బంధువులు కలిసి చికిత్స కోసం నల్లగొండ ప్రభుత్వాసుత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ అదే రాత్రి ఆసుపత్రిలో మృతి చెందాడు. నరేష్‌కు భార్య ఇద్దరు పిల్లలున్నారు. భార్యతో కొద్దికాలంగా నరేష్‌కుమార్‌కు గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె ఇదే గ్రామంలోని తన పుట్టింటికి పిల్లల్ని తీసుకుని వెళ్లింది. అయితే నరేష్ తల్లి బుచ్చమ్మ తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని కనగల్ పోలీసులను ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో ఇరు కుటుంబాల మధ్య గొడవలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా చండూర్ సీఐ ఆదిరెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ రాజీవ్‌రెడ్డి తన సిబ్బందితో గ్రామంలో బందోబస్తును ఏర్పాటుచేశారు. పోలీసుల పర్యవేక్షణలో నరేష్ మృతదేహానికి రాత్రి 8 గంటలకు అంత్యక్రియలు పూర్తయ్యాయి.

జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థి

వలిగొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా మోడల్ స్కూల్ విద్యార్థి జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. వలిగొండ మండలంలోని లోతుకుంట మోడల్ స్కూల్ విద్యార్థి గుండు ఉదయ్ అండర్-19 భువనగిరిలో జరిగిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రహీసున్నీసాబేగం తెలిపారు. ఈ నెల 30 నుంచి డిసెంబరు 5 వరకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలో పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థి ఉదయ్‌ను ఎంఈవో భాస్కర్, ఫిజికల్ డైరెక్టర్ ఐలయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.


విద్యార్థి ఉదయ్‌ను సన్మానిస్తున్న అధికారులు

ప్రకృతి సోయగం..

● వైజాగ్ కాలనీ

● నల్లమల అందాలు.. కృష్ణమ్మ పరుగులు
● పర్యాటకులను అకట్టుకుంటున్న ప్రకృతి అందాలు
● పర్యాటక కేంద్రంగా మార్చాలని డిమాండ్



కృష్ణానది మధ్యలో శివాలయం



వైజాగ్ కాలనీలో పర్యాటకుల సందడి



పెద్దమునిగల్ అంబ భవాని దేవాలయం

నేరెడుగొమ్ము, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నేరెడుగొమ్ము మండలంలోని వైజాగ్ కాలనీ ప్రకృతి అందాలతో పర్యాటకులను ఆకట్టుకుంటోంది. హైదరాబాద్ నుంచి 150 కిలోమీటర్ల దూరంలో గల ఈ ప్రాంతం చుట్టూ నల్లమల్ల అటవీ అందాలు.. పచ్చని పొలాలతో ప్రశాంతమైన వాతావరణంలో పర్యటకులను ఆకట్టుకుంటుంది. ఈ ప్రాంతవాసులు మినీ గోవాగా పిలుచుకుంటారు. నాగార్జునసాగర్ వెనుక జలాల్లో బోటింగ్ చేయడానికి ఇక్కడికి పర్యాటకులు వచ్చి ఒక తీపి అనుభూతిని పొందుతారు. ఒక్కొక్కరికి రూ.200 చొప్పున బోటింగ్ ప్రయాణం ఉంటుంది. ఈ ప్రాంతం చూపరులను వీపరితంగా ఆకట్టుకుంటోంది. ఈ ప్రాంతం చేపలకు ప్రసిద్ది చెందింది. ఇక్కడ దొరికే చేపల వంటకాలు నోరు ఊరిస్తాయి. వారంతాలు, సెలవు రోజుల్లో పర్యాటకుల రద్దీ అధికంగా ఉంటుంది. ఈ ప్రాంతానికి హైదరాబాద్, నల్లగొండ, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు, ఐటీ ఉద్యోగులు అధిక సంఖ్యలో సేదతీరడానికి వస్తూ ఉంటారు. వైజాగ్ కాలనీ వెళ్లే మార్గంమధ్యలో కృష్ణానది తీరాన పెద్దమునిగల్ గ్రామం వద్ద అంబ భవాని దేవాలయం చాలా ప్రాముఖ్యం కలిగింది. ప్రతీ సంవత్సరం దసరా ఉత్సావాలు ఘనంగా జరుగుతాయి. అమ్మవారిని పర్యాటకులు దర్శించుకుని వెళ్తారు. కృష్ణా నది మధ్యలో శివాలయం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇంతటి ప్రాముఖ్యం కలిగిన ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా ప్రభుత్వం అభివృద్ధి చేయాలని ఈ ప్రాంతవాసుల చిరకాలకోరిక. ఈ ప్రాంతాన్ని వసతులు కల్పించి అభివృద్ధి చేస్తే పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంటుంది. ఈ ప్రాంతవాసులకు ఉపాధి అవకాశాలు పెరిగి ఆర్థికంగా జీవనోపాధి దొరుకుతుంది. ఇక్కడికి చేరుకోవాలంటే ఆర్టీసీ సదుపాయం, అలాగే ఆటోలు ఉంటాయి.

ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించాలి



రోజు రోజుకు పర్యాటకులు అధికంగా వైజాగ్‌కాలనీకి వచ్చి, ఇక్కడి బోటింగ్ ప్రయాణం చేస్తున్నారు. అదే విధంగా ఇక్కడ దొరికే చేపలను వండించుకుని తిని సేదతీరుతున్నారు. ఈ ప్రాంతం ఇంకా అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా గుర్తించాలి.

చేపల బంగారి, వైజాగ్ కాలనీ

బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్‌గా స్వామిగౌడ్



నియామక పత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

శాలిగౌరారం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం నూలగడ్డ కొత్తపల్లి గ్రామానికి చెందిన ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ రీసెర్చ్ స్కాలర్ బొల్లెపల్లి స్వామిగౌడ్ బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాచిగూడలో ఏర్పాటు చేసిన బీసీ జేఏసీ విస్తృత స్థాయి సమావేశంలో బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర చైర్మన్‌గా స్వామి గౌడ్‌ను ఎన్నిక చేసి నియామక పత్రం అందజేశారు. స్వామి గౌడ్ అనేక రాష్ట్ర స్థాయి ఉద్యమాలలో చాలా చురుకుగా పని చేశారు. కార్యక్రమంలో తాళ్లూరి కౌశిక్, శ్రవణ్, అరవింద్, లక్ష్మణ్, సుభాష్, విగ్నేష్, గణేష్‌సైదులు, శివ యాదవ్, లింగస్వామి, శ్రీకాంత్, రమేష్, లింగాల మహేష్, వెంకట్, రఘు, వంశీ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌లో లీగల్ సర్వీసెస్ మెంబర్ సెక్రటరీ



బుద్ధ జ్యోతిని వెలిగిస్తున్న పంచాక్షరీ

నాగార్జునసాగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌ను రాష్ట్ర లీగల్ సర్వీసెస్ మెంబర్ సెక్రటరీ పంచాక్షరీ శనివారం కుటుంబ సమేతంగా సాగర్‌ను సందర్శించారు. ఉదయం సాగర్ విజయ విహార్ అతిథిగృహానికి చేరుకున్న ఆయనకు పెద్దవూర ఇన్‌చార్జీ తహసీల్దార్ శ్రీదేవి స్వాగతం పలికారు. అనంతరం బుద్ధవనానికి చేరుకున్న ఆయన అక్కడ బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. ఆ తర్వాత బుద్ధవనంలో చరితవనం, ధ్యానవనం, జాతక వనం, స్తూప వనం, మహాస్థూపాలను తిలకించారు. మహాస్థూపం అంతర్భాగంలో అష్టబుద్ధుల వద్ద బుద్ధ జ్యోతిని వెలిగించారు. ఆయనకు బుద్ధవనం ఈవో శాసన బుద్ధవనం బ్రోచర్, పంచశీల కండువాను అందజేశారు. అనంతరం లాంచీలో జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు చేరుకున్నారు. అక్కడ సింహళీయం, మ్యూజియం, బౌద్ధ మత స్థూపాలు, నమూనాలను, అశ్వమేథ యాగశాలను తిలకించారు. సాయంత్రం సాగర్ ప్రధాన డ్యాం, ప్రధాన జల విద్యుత్ కేంద్రం, గ్యాలరీలను తిలకించారు. ఆయనకు బుద్ధవనం, సాగర్ విశేషాలను పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ వివరించారు.కార్యక్రమంలో సాగర్ ఎస్ఐ ముత్తయ్య, ప్రొటోకాల్ ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి, కోర్టు సిబ్బంది కాలిక్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్‌కు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

సూర్యాపేటఅర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రానికి చెందిన పలువురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో నిర్వహించిన ఎంఎస్‌కే ప్రసాద్ ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమిలో శిక్షణ పొందుతున్న 12మంది క్రికెట్ క్రీడాకారులు వివిధ విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు అకాడమి హెడ్ కోచ్ షేక్ ఉస్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

● మాజీ మంత్రి హరీష్ రావు



హరీష్‌రావుకు స్వాగతం పలుకుతున్న నాయకులు

మర్రిగూడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థగత ఎన్నికల్లో టీఆర్ఎస్ శ్రేణులు సత్తా చాటాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. శనివారం మండలకేంద్రంలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా టీఆర్ఎస్ శ్రేణులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ శ్రేణులు ఐక్యతగా ఉండి పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం కృషిచేయాలన్నారు. అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఒక సైనికుడిగా పనిచేయాలని సూచించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర రైతుబంధు కమిటీ సభ్యులు బచ్చు రామకృష్ణ, రాష్ట్ర సీనియర్ నాయకులు అయిలీ లక్ష్మి, రామిడి వెంకటరమణారెడ్డి, చెరుకు లింగంగౌడ్, బీరప్ప, యాదయ్య మహేందర్ పలువురు ఉన్నారు.

చదువుల తల్లి.. చల్లని ఒడి

● సర్వేల్ గురుకులం

● విద్యా గంధం వెదజల్లుతున్న సర్వేల్ గురుకులం ● సర్వేల్ గురుకులానికి 54 ఏళ్లు ● నేడు గురుకుల స్ఫూర్తి ప్రదాతలు పీవీ, మద్ది విగ్రహాల ఆవిష్కరణ ● హాజరు కానున్న సీఎస్ రామకృష్ణారావు



సర్వేల్ గురుకులం

సంస్థాన్ నారాయణపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో సర్వేల్ గురుకుల పాఠశాల పేరు తెలియని వారు ఉండరు. 54 ఏళ్లుగా విద్యా సుగంధం వెదజల్లుతూ విద్యారంగంలోనే తన కంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది సర్వేలు గురుకులం. ఆధునిక గురుకుల విద్యాలయాలకు దిక్సూచిగా నిలుస్తున్న సంస్థాన్‌నారాయణపురం మండలం సర్వేల్‌లోని ఈ గురుకుల పాఠశాలలో చదివిన ఎంతోమంది విద్యార్థులు నేడు దేశం.. రాష్ట్రం.. గర్వించే స్థానాల్లో ఉన్నారు. దేశంలోనే మొట్టమొదటి సబ్ డైట్ సెంటర్ సైతం ఈ పాఠశాలలోనే ఏర్పాటయింది. ఈ పాఠశాల సాధిస్తున్న ఫలితాలకు ప్రభుత్వం స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సుగా ప్రకటించింది.

దేశంలో మొట్టమొదటి పాఠశాల

దేశంలోనే మొట్టమొదటి గురుకుల పాఠశాలకు సర్వేల్ గ్రామంలో అంకురార్పణ జరిగింది. సర్వేల్ గ్రామానికి చెందిన సర్వోదయ నాయకుడు మద్ది నారాయణరెడ్డి తన పర్యటనలో భాగంగా కలకత్తాలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ ఏర్పాటుచేసిన శాంతినికేతన్ సందర్శించారు. ఆ సమయంలోనే నారాయణరెడ్డి తమ స్వగ్రామంలో కూడా ఇలాంటి గురుకుల పాఠశాలను స్థాపించాలని ఆలోచించారు. తన ఆలోచనలను అప్పటి ముఖ్యమంత్రి పీవీ నరసింహారావుతో పంచుకున్నారు. ఇందుకోసం గ్రామంలో తాను నెలకొల్పిన సర్వోదయ ఆశ్రమానికి సంబంధించి 44 ఎకరాల స్థలాన్ని, ఆశ్రమాన్ని గురుకుల పాఠశాలకు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. మద్ది నారాయణరెడ్డి ఆలోచనలకు పీవీ నరసింహారావు సంకల్పం తోడవడంతో సర్వేల్ గ్రామంలో 1971 నవంబరు 23న దేశంలోనే మొట్టమొదటి గురుకుల పాఠశాలకు అంకురార్పణ జరిగింది. ముఖ్యమంత్రి పీవీ నరసింహారావు స్వయంగా పాఠశాల ను ప్రారంభించారు.

పాఠశాలలో దినచర్య

సర్వేల్ గురుకుల పాఠశాలలో ఇతర పాఠశాలకు భిన్నంగా దినచర్య ప్రారంభమవుతుంది. ఉదయం 5 గంటల నుంచి విద్యార్థులు చదువు బాట పడతారు. విద్యార్థులు ఉదయం ఐదు గంటలకే నిద్రలేస్తారు. పాలు, టీ తాగాక, ఆరు గంటలకు ప్రత్యేక తరగతులు ప్రారంభమవుతాయి. తొమ్మిది గంటలకు అల్పాహార కార్యక్రమం ఉంటుంది. ఉదయం ఐదు గంటల నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి రెండు గంటల వరకు మధ్యాహ్న భోజన విరామం ఉంటుంది. రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు తరగతులు జరుగుతాయి. ఐదు గంటల నుంచి క్రీడల్లో ఆసక్తి ఉన్న విద్యార్థులకు వివిధ రకాల క్రీడల్లో తర్ఫీదునిస్తారు. ఆరు గంటల నుంచి 8 గంటల వరకు చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులతోపాటు హోంవర్క్ ఇతర కార్యక్రమాలు నిర్వర్తిస్తారు. అనంతరం రాత్రి భోజనం కార్యక్రమం నిర్వహిస్తారు.

ఆధునిక గురుకులాలకు దిక్సూచి


సర్వేల్ గ్రామంలో ఏర్పాటు చేసిన గురుకుల విద్యాలయం సాధిస్తున్న ఫలితాలు నేడు ఆధునిక గురుకులాల ఏర్పాటుకు దిక్సూచిగా నిలిచాయి. ఈ పాఠశాల విద్యార్థులు కనబరిచే ప్రతిభ, ఇక్కడి విద్యార్థులు సాధించే ఫలితాలు చూసి రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక గురుకులాల ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఈ పాఠశాల స్ఫూర్తితో రాష్ట్రంలో ఎన్నో గురుకుల పాఠశాలలు ఏర్పాటు అయ్యాయి.

పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల పాత్ర

తాము చదివిన పాఠశాలనే కొంతమంది మరిచిపోతున్న ఈ రోజుల్లో తాము చదువుకున్న పాఠశాల రుణం తీర్చుకునేందుకు ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు నిరంతరం శ్రమిస్తున్నారు. అలోమిని అసోసియేషన్ పేరిట పూర్వ విద్యార్థులు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పాఠశాలలో ప్రస్తుతం చదివే విద్యార్థులకు ప్రభుత్వం కల్పించే వసతులతో పాటు తమ వంతు కూడా చేయూతనందిస్తున్నారు. ప్రతీ సంవత్సరం అసోసియేషన్ ఆధ్వర్యంలో పాఠశాలలో ఉచిత వైద్య శిబిరాలు, కెరియర్ గైడెన్స్ ప్రోగ్రాం, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు అందజేతలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. తాము చదువుకున్న సమయంలో తాము పడిన బాధలు ప్రస్తుతం చదివే విద్యార్థులు పడకూడదన్న ఉద్దేశంతో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

పీవీ, మద్ది విగ్రహాల ఆవిష్కరణ

సర్వేల్ గురుకుల విద్యాలయం ప్రారంభించి 54 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పాఠశాల ఏటుకు స్ఫూర్తిదాతలుగా నిలిచిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, సర్వోదయ నాయకుడు మద్ది నారాయణరెడ్డిల విగ్రహాలను ఆవిష్కరించనున్నారు. ఇటీవల నూతనంగా నిర్మించిన పాఠశాల భవనంలో ఏర్పాటుచేసిన వీరి విగ్రహాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ప్రారంభించనున్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, పీవీ ప్రభాకర్‌రావు, మద్ది మాధవరెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హాజరవుతున్నారు. వీరితో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొననున్నారు.



ప్రతిభకు నిదర్శనం

ఈ పాఠశాల ఎంతోమంది ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దింది. ఈ పాఠశాలలో చదివిన ఎంతోమంది పూర్వవిద్యార్థులు నేడు దేశ, విదేశాల్లో స్థిరపడ్డారు. ఈ పాఠశాలలో చదివిన ఎంతోమంది పూర్వ విద్యార్థులు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లుగా రాణిస్తున్నారు. అంతేకాకుండా ఎంతో మంది డాక్టర్లు, ఇంజనీర్లను తయారు చేసిన ఘనత ఈ పాఠశాలకే సొంతం. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావుతోపాటు, మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి, సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ బుర్ర వెంకటేశంలాంటి ప్రముఖులు ఈ పాఠశాలలో చదివిన వారే.

లక్షల ఎకరాలను పేదలకు పంచిన ఘనత సీపీఐది

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పద్మ



ఆలేరులో మాట్లాడుతున్న పశ్య పద్మ

ఆలేరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): శతాబ్ద కాలంలో ఎన్నో పోరాటాలు, త్యాగాలు ఎంతోమంది అమరవీరుల రక్తతర్పనంతో ఎన్నో విజయాలు సాధించిన సీపీఐ భారతదేశ రాజకీయ చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానం సాధించుకుందని ఆ పార్టీ జాతీయ కమిటీ సభ్యులు పశ్య పద్మ అన్నారు. సీపీఐ ఆవిర్భవించి వందేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 26న ఖమ్మం జిల్లా కేంద్రంలో చేపడుతున్న భారీ బహిరంగ సభ విజయవంతంకోరుతూ ఈ నెల 17న ప్రారంభించిన బస్సుజాత శనివారం జిల్లాలోని ఆలేరుకు చేరుకున్న సందర్భంగా ఆమె మాట్లాడారు. ముందుగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి వందనం చేశారు. భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యంకావాలని తొలుత జరిపించిన ఏకైక పార్టీ సీపీఐ అన్నారు. కార్మిక, విద్యార్థి, యువజన, రైతు, మహిళా తదితర ప్రజాసంఘాలను నిర్మించి వెట్టిచాకిరి విముక్తికోసం కార్మికులు, కర్షకులను దోపిడినుంచి విముక్తి చేయడానికి రాజీలేని పోరాటాలు నిర్వహించిందన్నారు. అంతకుముందు మండలంలోని కొలనుపాకకు చేరుకొని తెలంగాణ రైతాంగ సాయుధపోరాట యోధుడు ఆరుట్ల రాంచంద్రారెడ్డి కమలాదేవి దంపతుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, బస్సుజాత బృందం ప్రతినిధులు వలీ ఉల్లాఖాద్రి, నరేంద్రప్రసాద్, సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బోద శ్రీరాములు, ఆరుట్ల సుశీలాదేవి, జిల్లా కమిటీ సభ్యులు వెంకటేష్ పాల్గొని మాట్లాడారు. జాతాకు స్వాగతం పలికిన వారిలో జిల్లా నాయకులు బొలగాని సత్యనారాయణ, కనకయ్య, రాజు, శ్రీనివాస్, కందుల మధు, పోతుగంటి రవి, ప్రవీణ్‌కుమార్, జానమ్మ, ఆంజనేయులు, సరల, కొల్లూరి రాజయ్య, రాములు, భవాని ఉన్నారు.

ప్రజల పక్షానే సీపీఐ పోరాటం

రాజాపేట: ప్రజల కోసం.. ప్రజల పక్షాన నిలిచి పోరాటాలు నిర్వహించిన ఘనత సీపీఐదేనని పశ్య పద్మ అన్నారు. శనివారం రాజాపేట మండలానికి చేరుకున్న బస్సు జాతాకు స్థానిక నాయకులు బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరంచేస్తూ అంబాని ఆస్తులను పెంచుతున్నారని విమర్శించారు. మోదీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు చట్టాలను రద్దుచేసే వరకూ పోరాటాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో యానాల దామోదర్ రెడ్డి, నరేంద్ర ప్రసాద్, గోద శ్రీరాములు, కొల్లూరి రాజయ్య, సత్యనారాయణ, కృష్ణ, చిగుర్ల లింగం, మహేందర్, మూల పోచయ్య పాల్గొన్నారు.

తిరుపతి పద్మశాలి అన్నసత్రం ఆర్గనైజింగ్ సెక్రటరీగా దానయ్య



భూదాన్‌పోచంపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి క్షేత్రంలోని అఖిల భారత భక్త మార్కండేయ పద్మశాలి అన్నసత్రం నూతన కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భూదాన్‌పోచంపల్లి పట్టణానికి చెందిన బడుగు దానయ్య ఎన్నికయ్యారు. దివంగత నేత ఎలిమినేటి మాధవరెడ్డి అనుచరుడు బడుగు దానయ్య టీడీపీ రాష్ట్ర నాయకుడిగా, పోచంపల్లి అర్బన్ బ్యాంకు వ్యవస్థాపక మండలి డైరెక్టర్‌గా, భూదాన్‌పోచంపల్లి ప్రథమ మండలాధ్యక్షుడిగా క్రియాశీలకంగా పనిచేసి అందరి మన్ననలు పొందారు. బడుగు దానయ్య నియామకంపై శనివారం రాష్ట్ర చేనేత నాయకులు తడక వెంకటేష్, అర్బన్ బ్యాంకు చైర్మన్ తడక రమేష్, భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములుశ్రేష్ఠి, ఉపాధ్యక్షుడు అంకం మురళి హర్షం వ్యక్తం చేశారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామివారి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి. సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించిన అర్చకులు సాయంత్రం వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి మహామండపంలో స్పటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి.

భక్తుల రద్దీ

రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు శివకేశవుల క్షేత్ర సందర్శనకు శనివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉభయ క్యూలైన్లు ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. సుమారు 25వేల మంది భక్తులు ఇష్టదైవాలను దర్శించుకోగా ప్రత్యేక దర్శనం అరగంట, ధర్మదర్శనం గంట సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 37,80,654 ఆదాయం వచ్చినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. స్వామివారి హుండీ లెక్కింపు రేపు (సోమవారం) నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు. కొండకింద సత్యదేవుని వ్రత మండపంలో ఉదయం 7 గంటలకు లెక్కింపు ప్రారంభిస్తామన్నారు. ప్రతీ వారం నిర్వహించే సంగీత సభల్లో భాగంగా అభినయ రుద్ర నృత్యాలయం (ఖమ్మం) భరతనాట్యం, మీఎస్‌ఆర్‌కే కళాక్షేత్రం (హైదరాబాద్) కూచిపూడి నృత్యం, పిల్లుట్ల గోవర్దన్ (జనగాం) సతీ సావిత్రి యక్షగానం భక్తులను ఆకట్టుకున్నాయి.

స్నేహపూర్వక సేవలు : మంత్రి పార్థసారథి

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి చెంత అధికారులు, సిబ్బంది సేవలు స్నేహపూర్వకంగా సేవలు అందజేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ సమాచార, పౌర సంబంధాల మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. యాదగిరిగుట్ట స్వామిని దర్శించుకొని శనివారం మనుమరాలికి అన్నప్రాసన జరిపించి స్వయంభువులకు మొక్కులు తీర్చుకున్నారు.

రూ. 40కి గిట్టుబాటు కాదు : వర్తకుల మొర

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి చెంత రూ.40కి కొబ్బరికాయ విక్రయిస్తే తమకు గిట్టుబాటు కాదని వర్తక సంఘం వెల్ఫేర్ సంఘం ప్రతినిధులు ఈవో ఎస్. వెంకట్రావుకు మొర పెట్టుకున్నారు. కొండపై ప్రధాన కార్యాలయంలో శనివారం వర్తకులు ఈవోకు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. వినతి పత్రం అందజేసిన వారిలో వర్తక వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడు గడ్డమీది మాధవులు, కార్యదర్శి ఆకుల నర్సింగరావు, కోశాధికారి గుండ్లపల్లి నర్సింహా, కొన్నె రమేష్, గడ్డమీది రాజు, వెంకటేశ్ ఉన్నారు.

అయ్యప్ప స్వాముల గిరిప్రదక్షిణ

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారికి అయ్యప్పస్వాములు మొక్కులు చెల్లించుకోనున్నారు. ఏఈవో రఘు, స్వాముల బృందంతో కలిసి ఈవో ఎస్. వెంకట్రావు కరపత్రం ఆవిష్కరించిన సందర్భంగా రాజుస్వామి మాట్లాడుతూ డిసెంబరు 1న రాష్ట్ర వ్యాప్తంగా అయ్యప్పలు గిరిప్రదక్షిణ చేస్తారన్నారు.

నల్లగొండ
నకిరేకల్ - మునుగోడు

ఆహ్లాదకరంగా అంతంపేట సోమేశ్వరాలయం

» ఎన్ఆర్ఐ సహకారంతో రెండేళ్లలో నిర్మాణం పూర్తి » ఆధ్యాత్మిక వాతావరణం ఉండేలా ఏర్పాట్లు



జాతరలో భక్తుల కోలాహలం, ఆలయ పరిసరాల్లో మొక్కలు నాటుతున్న దృశ్యం (ఫైల్)

నల్లగొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గట్టుప్పల్ మండలంలోని అంతంపేట గ్రామంలో ఎన్ఆర్ఐ సహకారంతో గ్రామస్థులంతా కలిసికట్టుగా సోమేశ్వరాలయాన్ని రెండేళ్లలోనే నిర్మాణం పూర్తి చేసుకున్నారు. ఈ ఆలయంలో ఇప్పటికే ఉత్సవాలతో పాటు జాతర కూడా నిర్వహించుకున్నారు. మరో రెండు నెలల్లో మరోసారి ఆలయంలో ఉత్సవాలను నిర్వహణ కోసం సన్నాహాలు చేస్తున్నారు. సుమారు 2.5 ఎకరాల్లో నిర్మాణం పూర్తయిన ఈ ఆలయానికి సంబంధించి గ్రిల్స్‌ను ఏర్పాటు చేయాల్సి ఉందని దీంతో పనులు పూర్తిగా అయిపోతాయని నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఆలయ నిర్మాణం కోసం అమెరికాలో స్థిరపడిన కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఇప్పటికే రూ.20లక్షల వరకు వెచ్చించి ఆలయ నిర్మాణానికి సహకరించారు. మర్రిగూడ మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ కుంభం శ్రీనివాస్‌రెడ్డి తన ప్రాంతంపై ఉన్న మమకారం, అభిమానంతో ఈ ఆలయ నిర్మాణానికి సహకరించాడు. విదేశాల్లో స్థిరపడినప్పటికీ ప్రాంతంపై ప్రేమతో ఆలయ నిర్మాణానికి ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి సేవలు అందించారు. ఆలయ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారు. భవిష్యత్తులో ఈ సోమేశ్వరాలయంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని తలపించేలా ఉండటం కోసం దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించడం కోసం నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. నూతన శివాలయం నిర్మాణంతో ఆ గ్రామంలో ఇప్పటికే ఆధ్యాత్మిక వాతావరణం నెలకొందని చెప్పవచ్చు. దేవదాయ శాఖ మరింత సహకారం అందిస్తే ఈ అంతంపేటలోని సోమేశ్వరాలయం మరింత అభివృద్ధి చెందుతుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

ఆలయ పరిసరాలల్లో ఆహ్లాదం ఉండేలా...

సోమేశ్వరాలయం నూతనంగా నిర్మాణమైన నేపథ్యంలో ఈ ఆలయం పరిసరాల్లో పర్యావరణ పరిరక్షణతో పాటు ఆహ్లాదకర వాతావరణంలో ఉండేలా మొక్కలను పెద్ద ఎత్తున నాటడానికి ప్రణాళికలను రూపొందించారు. నిత్యం పూజలు నిర్వహించడంతో పాటు భక్తుల సౌకర్యం కోసం ఏర్పాట్లను చేపడుతున్నారు. వచ్చే శివరాత్రి నాటికి సోమేశ్వరాలయంలో భక్తులకు ప్రత్యేకమైన అనుభూతి ఉండేలా స్వామి వారి అభిషేకాలు, అర్చనలు వంటివి నిర్వహించడం కోసం నిత్యం ఆలయంలో పూజలు ఉండటం కోసం ఏర్పాట్లు చేశారు. ఈ ఆలయాన్ని దర్శిస్తే మోక్షం లభించేలా బాధల నుంచి ఉపశమనం కలిగేలా భక్తులకు నమ్మకం కలిగించడం కోసం భక్తుల రాక అధికంగా ఉండటం కోసం ఆలయ నిర్వాహకులు కార్యాచరణ రూపొందించి అందుకు అనుగుణంగా ముందుకు సాగుతున్నారు. మొత్తానికి గట్టుప్పల్ మండలంలోని అంతంపేట గ్రామంలో సోమేశ్వరాలయం పూర్తి కావడంతో ఆ గ్రామంలో ప్రత్యేక ఆధ్యాత్మిక వాతావరణం నెలకొందని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

సామాజిక సేవ కార్యక్రమాల్లో....

ఎన్ఆర్ఐ కుంభం శ్రీనివాస్‌రెడ్డి దేవాలయాలకు తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తూనే మరోవైపు సామాజిక సేవ కార్యక్రమాల్లో కూడా భాగస్వాములు అవుతున్నారు. విద్య, వైద్యానికి కూడా సేవలు అందిస్తున్నారు. పాఠశాలలకు సహాయ, సహకారాలు అందిస్తూనే తలసేమియా వంటి వ్యాధితో బాధపడుతున్న వారికి ఆర్థిక సాయం అందజేసి చికిత్స కోసం సహకారం అందించిన సందర్భాలు ఉన్నాయి. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో పాటు ఇతర ఖర్చుల కోసం సహకారం అందించడం వల్ల ఆయా కుటుంబాలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. అదేవిధంగా మర్రిగూడ మండలంలోని శివన్నగూడెం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు తన సొంత డబ్బులతో పాఠశాలకు సీసీ కెమెరాలు అందజేయడంతో పాటు రంగులు కూడా వేయించారు. తాను తన సొంత ప్రాంతానికి సేవలు అందించడం వల్ల ఎంతో సంతోషంగా ఉందని ఎన్ఆర్ఐ కుంభం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొంటున్నారు.

నేడు చీరల పంపిణీ

కేతేపల్లి, నవంబరు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళలకు ఆదివారం ఇందిరా మహిళా శక్తి చీరలు, కల్యాణలక్ష్మి చెక్కులు ఎమ్మెల్యే వేముల వీరేశం పంపిణీ చేయనున్నట్లు ఏకేపీ ఏపీఎం వలిశెట్టి మల్లేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్ వేర్వేరుగా తెలిపారు. స్థానిక రైతువేదికలో నిర్వహించే కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన మహిళలు, హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

వరి కొయ్యలను తగులబెట్టవద్దు

ఎన్.సౌమ్య, ఏవో, శాలిగౌరారం



వరి కొయ్యలను తగుల బెట్టకుండా, పొలంలోనే కలియదున్ని సేంద్రీయ పదార్థాలను పెంచాలని శాలిగౌరారం ఏవో ఎన్.సౌమ్యశ్రుతి రైతులకు సూచించారు. శనివారం ఆమె 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

(శాలిగౌరారం, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: వరి కొయ్యలను కాల్చడంతో భూమికి ఏమైనా నష్టం జరుగుతుందా?

ఏవో: వరి కొయ్యలను కాల్చితే నేలలోని సేంద్రీయ పదార్థాలు, పోషకాలు నశిస్తాయి. నేలలో ఉన్న వానపాములు, సూక్ష్మజీవులు వేడితో చనిపోతాయి. వాతావరణ కాలుష్యం పెరుగుతుంది. భూమి గట్టిపడి నీరు నిల్వ సామర్థ్యం తగ్గుతుంది. క్రమేపీ చౌడు భూమిగా మారి భూసారం కోల్పోయి పంట దిగుబడులు తగ్గుతాయి.

ఆంధ్రజ్యోతి: మండలంలో రబీ సీజన్‌లో ఎక్కువ ఏ పంటలు వేస్తున్నారు?

ఏవో: రబీలో ఎక్కువగా వరి పంటను సేద్యం చేస్తారు. వరిలో 1010, బీపీటీ రకాలు సాగు చేస్తారు. తరువాత మిర్చి పంటను వేస్తారు.

ఆంధ్రజ్యోతి: రైతులు కపాస్ యాప్‌ను సద్వినియోగం చేసుకుంటున్నారా?

ఏవో: రైతులు కపాస్ యాప్‌లో పత్తిని అమ్ముకోవడానికి స్లాట్ బుకింగ్ చేసుకుంటున్నారు. పత్తి కొనుగోళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం ఎంత?

ఏవో: మండలంలో ఇప్పటి వరకు 1,04,620 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం.

ఘనంగా సాయిబాబా శతవర్ష వేడుకలు

నల్లగొండ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీసత్య సాయిసేవా సమితి నల్లగొండ ఆధ్వర్యంలో శ్రీసత్యసాయిబాబా శతవర్ష జయంతి మహోత్సవ వేడుకలు శనివారం పట్టణంలోని రాఘవేంద్రనగర్ కాలనీలోని ఆధ్యాత్మిక కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. భక్తులు సాయిబాబాను కీర్తిస్తూ శ్లోకాలను, భజనలను భక్తితో చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకిలో సాయిబాబా విగ్రహాన్ని ఏర్పాటు చేసి పురవీధుల గుండా పల్లకిసేవను నిర్వహించారు. రాఘవేంద్ర, పద్మావతి కాలనీతో పాటు పలు కాలనీల్లో పల్లకిసేవ ఊరేగింపు కొనసాగింది. పల్లకిసేవ ముందు భక్తులు కీర్తనలు, భజనలు, మహిళా బృందంతో కోలాట ప్రదర్శనలు చేశారు. ప్రజలకు పులిహోర, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళ, పురుష సేవాదళ్ సభ్యులు, భక్తులు, బాలవికాస విద్యార్థులు, సమితి కన్వీనర్ పున్న విశ్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

యాచకులకు దుప్పట్ల పంపిణీ

కనగల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ ఎల్లమ్మ ఆలయ పరిసరాల్లో సంచరిస్తున్న యాచకులకు సామాజిక సేవా కార్యకర్త కంబాల శివలీలారెడ్డి జనహిత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ మునీర్ షరీఫ్ కుమార్తె సాదియా సహకారంతో శనివారం దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివలీలారెడ్డి మాట్లాడుతూ యాచకులు ఫుట్‌పాత్ మీద నిద్రిస్తూ చలికి తట్టుకోలేకపోతున్నట్లు తెలిపారు. తనవంతు సాయంగా వారికి దుప్పట్లను అందజేశానని వివరించారు. ప్రతీ ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలన్నారు. నిరాశ్రయులను ఆదుకోవాలని సూచించారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో
మాదారం విద్యార్థులకు మొదటి బహుమతి

శాలిగౌరారం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ టాలెంట్‌లో మండల స్థాయిలో శాలిగౌరారం మండలం మాదారం జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ప్రథమ బహుమతి సాధించినట్లు ఎంఈవో మండల సైదులు తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులు పిట్టల శిరీష, పిట్టల వెంకన్న, అంకిరెడ్డి, ఉదయ, మనోహర్‌లకు ఎంఈవో సైదులు, మాదారం పాఠశాల హెడ్ మాస్టర్ లగిశెట్టి సత్యనారాయణ మెమొంటోలు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం శంకర్, ఉపాధ్యాయులు రవి, షైబ్ పాల్గొన్నారు. అనంతరం మాదారం గ్రామ ఉద్యోగస్థుల అడహక్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ బహుమతి సాధించి విద్యార్థులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున ప్రోత్సాహక ప్రైజ్ మనీ ఇవ్వాలని నిర్ణయించినట్లు ఉపాధ్యాయులు అనుమాల శ్రీనివాస్ తెలిపారు.

పశువైద్య శిబిరంలో మందుల పంపిణీ

కనగల్, నవంబరు 22:(ఆంధ్రజ్యోతి) మండలంలోని జీఎడవల్లి గ్రామంలో శనివారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా సుమారు 60 పాడి గేదెలకు గర్భకోశ వ్యాధి చికిత్సను అందించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జేడీ జీవీ.రమేష్, విజయ్‌కుమార్‌శర్మ, పశువైద్యాధికారి బాబు, సిబ్బంది సురేష్, జగత్ పాల్గొన్నారు.

సీఐటీయూ మండల కన్వీనర్‌గా లింగయ్య

కనగల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ మండల కన్వీనర్‌గా నెలుగుందరాశి లింగయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కనగల్‌లో శనివారం నిర్వహించిన సంఘ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాలుగు లేబర్ కోడ్ల అమలుకు కేంద్రం ప్రభుత్వం జారీ చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో నల్లగొండ పట్టణంలో జరిగే సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కానుగు లింగస్వామి కార్యక్రమంలో నాయకులు బురకల నర్సింహ, దాసరి నరసింహ, జీవనజ్యోతి, యాదయ్య, రాములు, నాగులు, శేఖర్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

పంచాయతీలకు రిజర్వేషన్ల ఖరారు నేడు

(5వ పేజీ తరువాయి)

సైతం తగిన సమయం ఉండేలా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఈ నేపథ్యంలో రెండు రోజుల వ్యవధి చొప్పున మూడు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తే పోలీస్ బందోబస్తుకు ఇబ్బంది ఉండదని పోలీసులు యోచిస్తున్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల రిజర్వేషన్‌ను పాత పద్ధతినే 50 శాతానికి లోబడి రోటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు ఖరారు కానున్నాయి. గ్రామపంచాయతీలకు కేంద్రం నుంచి కోట్ల రూపాయల నిధులు రావాల్సి ఉండటంతో ప్రభుత్వం ఈ ఎన్నికలను త్వరితగతిన నిర్వహించాలని భావించడంతో అందుకు అనుగుణంగా వేగవంతంగా అడుగులు పడుతున్నాయి. పంచాయతీ ఎన్నికలు పూర్తయి పాలకవర్గం బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆర్థిక సంఘం నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయనుంది.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

చిట్యాలరూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిమినేడుకు చెందిన సీపీఎం సీనియర్ సభ్యుడు గుంటోజు వీరయ్య ఇటీవల మృతి చెందాడు. శనివారం వీరయ్య చిత్రపటానికి పార్టీ రాష్ట్ర నాయకుడు బొంతల చంద్రారెడ్డి, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. గ్రామశాఖ ఆధ్వర్యంలో సేకరించిన రూ.16వేలు మృతుని భార్య గుంటోజు భారతమ్మ, కుమారుడు సిద్ధప్పలకు అందజేశారు. వీరయ్య కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నెలికంటి నర్సింహ, పంది నరేష్, నాతి వెంకట్రామయ్య, సుర్కంటి మోహన్‌రెడ్డి, రమేష్, లింగస్వామి, శంభయ్య, నర్సింహ, రాములు పాల్గొన్నారు.

సీపీఎం నేత మృతికి నివాళి

నార్కట్‌పల్లి: మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు చిక్కుళ్ల లింగయ్య(60) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ హాషం, నర్సిరెడ్డి, పార్టీ మండల కార్యదర్శి చింతపల్లి బయ్యన్న, వెంకటేశ్వర్లు మృతదేహం సంతాపం తెలిపారు.

నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలి



అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

మర్రిగూడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేసి, కార్మిక సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య డిమాండ్ చేశారు. మర్రిగూడ మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం కేంద్రప్రభుత్వం నవంబరు 20న విడుదల చేసిన నోటిఫికేషన్‌కు నిరసనగా బస్టాండ్ సమీపంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయడం అన్యాయమని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఇందిరమ్మ, ముత్తమ్మ, నరసమ్మ, పద్మ, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి: కార్మికుల శ్రమను కేంద్రప్రభుత్వం దోచుకుంటుందని, కార్మికవర్గ హక్కుల సాధన కోసం కార్మికులందరూ సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, సీఐటీయూ మండల కన్వీనర్ ఎదుళ్ల సునీత అన్నారు. మండల కేంద్రంలో లేబర్ కోడ్ అమలుకు జా రీ చేసిన నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలని కోరు తూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు రేవల్లి యాద య్య, నాయకులు పిల్లి మోహన్, మరియమ్మ, సులోచన శ్రవణ్, రామస్వామి, సురేష్ పాల్గొన్నారు.

కట్టంగూరు: కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్పొరేట్లకు ఊడిగం చేసేలా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ నోటిఫికేషన్ జీవోను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు పొన్న అంజయ్య డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ వర్కర్లు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా విధానాలను మారుస్తూ అసంఘటిత కార్మికుల హక్కులను కాలరాస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల సమన్వయ కమిటీ కన్వీనర్ చెరుకు జానకి, కత్తుల రామలింగయ్య, యాదమ్మ, లక్ష్మి, సైదులు, గిరి పాల్గొన్నారు.

బొమ్మ పడితేనే.. బులుగు చీర!

(5వ పేజీ తరువాయి)

పొందాలంటే మహిళలు సెర్ప్ ప్రొఫైల్ యాప్‌లో ఫొటో దిగాల్సి ఉంది. ఇప్పటికే వీబీకేలు (విలేజ్ బుక్ కీపర్) వారి మొబైల్ ఫోన్‌లలో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నారు. ఓ మహిళకు చీర అందజేయాలంటే యాప్‌లో గ్రామం, కోడ్ నెంబర్, సమభావన సంఘం పేరు నమోదు చేయగానే సంఘంలోని సభ్యుల వివరాలు వస్తాయి. జాబితాలోని సదరు మహిళ పేరుపై క్లిక్ చేసి చీరను అందుకునే మహిళ ఫొటోను క్యాప్చర్ చేయాల్సి ఉంటుంది.

అది విజయవంతంగా నమోదై, వివరాలు ఫొటో సహా సెర్ప్ ప్రొఫైల్ యాప్‌లో నిక్షిప్తమవుతాయి. ఆ తర్వాతే మహిళకు సంబంధిత చీరను వీబీకే అందజేస్తారు. దీంతో పాటు మరో దస్త్రంలో పేరు, ఆధార్ వివరాలను కూడా నమోదు చేస్తారు.

సర్వర్ సమస్య ఎదురవుతుందేమో?

చీరల పంపిణీలో పారదర్శకత కోసం యాప్ విధానాన్ని ప్రవేశపెట్టినా ఆచరణలో సర్వర్ సమస్యలు ఎదురవుతాయ నే సందేహం వీబీకేల్లో వ్యక్తమవుతోంది. కొద్ది రోజుల్లో స్థానిక ఎన్నికలు జరగను న్న నేపథ్యంలో ప్రభుత్వం కూడా ఇంది రా మహిళా శక్తి చీరల పంపిణీని ప్రాధాన్యంగా భావించి ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చినట్లు తెలిసింది. ప్రభుత్వ ప్రజాప్రతినిధుల ద్వారా ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించాక ఒకటి రెండు రోజుల్లోనే మిగతా అందరికీ చీరల పంపిణీని పూర్తిచేయాలని మౌఖిక ఆదేశాలిచ్చినట్లు సమాచారం. అయితే చీరల పంపిణీకి ఎక్కువ సమయం ఇవ్వకపోవడం పైగా రాష్ట్రమంతటా ఏకకాలంలో వీబీకేలు యాప్‌లో వివరాలు ఫొటో క్యాప్చర్ చేయాల్సి ఉండంతో సర్వర్ సమస్యలు ఎదురవుతాయని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పీఎన్ఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

చిట్యాల: మాడుగులపల్లిలో డిసెంబరు 6,7 తేదీల్లో జరిగే ప్రజానాట్యమండలి జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పీఎన్ఎం జిల్లా నాయకుడు జిట్ట నగేష్ కోరారు. చిట్యాలలో శనివారం జిల్లా మహాసభల పోస్టర్‌ను ఆయన విడుదల చేసి మాట్లాడారు. సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేయడానికి పీఎన్ఎం కృషి చేస్తుందన్నారు. అనంతరం ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు సూర్యాపేటలో జరిగే కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పామునగుల్ల అచ్చాలు, స్వామి, లింగస్వామి, హనుమంతు పాల్గొన్నారు.

నేడు వార్డు సభ్యుల రిజర్వేషన్ల ఖరారుకు సమావేశం

కట్టంగూరు: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామపంచాయతీ వార్డు రిజర్వేషన్లు ఖరారు చేయడానికి మండల స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జ్ఞాన ప్రకాశ్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 22 గ్రామపంచాయతీలకు చెందిన 206 వార్డుల రిజర్వేషన్లు ఖరారు చేశామని, మండల స్థాయి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశానికి తప్పక హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

పాఠశాలల బలోపేతానికి సహకరించాలి

కేతేపల్లి: గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేయడానికి దాతలు సహకరించాలని మండలంలోని భీమారం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం కె.భిక్షమయ్య కోరారు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన సుధాకర్ పీవీసీ కంపెనీ భీమారం జడ్పీ పాఠశాలకు రూ.40 వేల విలువైన బీరువా, 10 కుర్చీలను విరాళంగా అందించింది. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో భిక్షమయ్య మాట్లాడారు. అనంతరం సుధాకర్ పీవీసీ కంపెనీకి ప్రతినిధి అచ్యుతశర్మను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గుండా వెంకటేశ్వర్లు, కన్నె శివయ్య, జి.రమేష్, ఎల్.శ్రీధర్, నాగయ్య, పరమేష్ పాల్గొన్నారు.

శ్మశానవాటికను ఏర్పాటు చేయవద్దు

మర్రిగూడ: రాజుపేట గ్రామపంచాయతీ పరిధిలో ఉన్నటువంటి సర్వేనెంబర్ 316లోని ప్రభుత్వ భూములు శ్మశాన వాటిక నిర్మాణం చేపట్టవద్దని ఆ ప్రాంత రైతులు శనివారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ ప్రభుత్వ సర్వే నెంబర్‌లో పురాతన కాలం నుంచి మండేలమ్మ దేవాలయం ఉందన్నారు. శ్మశాన వాటికను ఏర్పాటు చేయవద్దని వారు కోరారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వేముల వీరేశం, మందుల సామేలు



మునుగోడులో చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళల ఆత్మ విశ్వాసం, ఆత్మగౌరవం నిలబడేలా ఇందిరమ్మ చీరల పంపిణీ చేస్తున్నట్లు ఆయన అన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేసిన లక్షల కోట్లు అప్పులు తీర్చుతూనే మహిళలకు ఇందిరమ్మ చీరలు అందజేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో బెల్ట్ షాపుల నియంత్రణకు తను కట్టుబడి ఉన్నానని తెలిపారు. గ్రామాల్లో కొందరు అతిగా మద్యం సేవిస్తున్న కారణంగా అనారోగ్యం పాలవుతున్నాడని, ఫలితంగా బాధిత కటుంబం బజారున పడే దుస్థితి నెలకొంటుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి, ఎంపీడీవో యుగంధర్ రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ నరేష్ పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలకేంద్రంలో శనివా రం పొదుపు సంఘాల మహిళలకు ఇందిరా మహిళా శక్తిచీరల పంపిణీతో పాటు 41 మందికి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ పేరిట బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి కేటీఆర్ రూ.600 కోట్లు దోపిడీ చేశాడని ఎమ్మెల్యే వీరేశం ఆరోపించారు. గత ప్రభుత్వం నాణ్యమైన చీరలు ఇవ్వకుండా నాసిరకం చీరలు పంపిణీ చేసి మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని విమర్శించారు. ఆలస్యమైనా మహిళలకు నాణ్యమైన చీరలే ఇవ్వాలనే సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచన మేరకే చీరల పంపిణీలో ఆలస్యమైందన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, మార్కెట్ చైర్మన్ నర్రా వినోద్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఐతరాజు యాదయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, నాయకులు దూదిమెట్ల సత్తయ్య, దార యాదయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, బింగి కొండయ్య, తొడుసు వీరయ్య, జెరిపోతుల భరత్, పుల్లెంల అచ్చాలు, దూదిమెట్ల స్రవంతి, కొంపెల్లి సైదులు, నర్సిరెడ్డి, శంకర్, నవీన్‌రెడ్డి, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో ఉమేష్‌చారి, ఆర్ఐ తరుణ్, డీపీఎం వెంకట్‌రెడ్డి, ఏపీఎం జీడికల్లు తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం చిట్యాలలో మహిళలకు ఇందిరమ్మ చీరలు అలాగే లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, మునిసిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ నర్రా వినోద మోహన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, పోకల దేవదాస్, జడల చినమల్లయ్య, ఎంపీడీవో జయలక్ష్మి, డీటీ విజయ పాల్గొన్నారు.



ఇందిరమ్మ చీరలను అందుకున్న మహిళలతో ఎమ్మెల్యే వీరేశం


శాలిగౌరారం: దేశ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఆశయాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నెరవేర్చడంలో ముందుందని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. శనివారం శాలిగౌరారంలో ఇందిరా మహిళా శక్తి చీరలను, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే సామేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గార్లపాటి జ్యోతి లక్ష్మి, తహసీల్దార్ బిట్ల వరప్రసాద్, ఏపీఎం పోలేపల్లి శంకర్, మండల మహిళా సంఘం అధ్యక్షురాలు వంగూరి కవిత వెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నరిగే నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, మాజీ వైస్ ఎంపీపీ భూపతి అంజయ్య, షేక్ ఇంతియాజ్ అహ్మద్, గూని వెంకటయ్య, చింత ధనుంజయ్, నోముల జనార్దన్, వేముల గోపినాథ్, కట్టంగూరి సురేందర్‌రెడ్డి, వడ్లకొండ పరమేష్, పుల్లూరి దేవేందర్, భూపతి వెంకన్న, బొల్లికొండ గణేష్, అరుణ్ శ్రీనివాస్, ఆర్ఐలు అజారుద్దీన్, రఫీద్, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశం, వెలుగు సీసీలు తదితరులు పాల్గొన్నారు



మహిళలకు చీరలు అందజేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేలు

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

మర్రిగూడ: మహిళల అభ్యున్నతే లక్ష్యంగా ఉందని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్, ఎంపీడీవో మున్నయ్య అన్నారు. శనివారం మహిళలకు ఇందిరమ్మ శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని మండలకేంద్రంలోని రైతు వేదిక సమావేశ మందిరంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య, మాల్ మార్కెట్ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీరామదాసు శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ బాలయ్య, బుర్ర శేఖర్, అజీజ్‌రెడ్డి ఉన్నారు.

ఆంధ్రజ్యోతి
***
ANDHRAJYOTHY

నల్లగొండ
5
ఆదివారం 23 నవంబరు 2025

అతివేగంతోనే అనర్థాలు

- బ్లాక్‌స్పాట్‌ల వద్ద రక్షణ చర్యలు కరువు
- ప్రమాదాలతో పదుల సంఖ్యలో కోల్పోతున్న ప్రాణాలు

6



పంచాయతీలకు రిజర్వేషన్ల ఖరారు నేడు



గ్రామపంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం శనివారం జీవో జారీ చేసింది. వార్డు సభ్యులు, సర్పంచ్ పదవుల రిజర్వేషన్లకు విధివిధానాలను ఖరారు చేసింది. 50 శాతానికి మించకుండా రిజర్వేషన్లపై మార్గదర్శకాలు జారీ చేయడంతో రిజర్వేషన్ల ఖరారుకు అధికార యంత్రాంగం ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. జీవో జారీ అయిన వెంటనే అధికారులు రిజర్వేషన్ల పనుల్లో నిమగ్నమయ్యారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

- 50శాతానికి మించకుండా రిజర్వేషన్లు
- జీవో నెంబర్ 46ను జారీ చేసిన ప్రభుత్వం
- రోటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు
- ఎన్నికల నిర్వహణను వేగవంతం చేసిన యంత్రాంగం

ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళ రిజర్వేషన్లను రోటేషన్ పద్ధతిలో అమలు చేయాలని ప్రభుత్వం జీవోలో పేర్కొంది. 100శాతం ఎస్టీలు ఉన్న గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలు అన్ని ఎస్టీలకే రిజర్వు అయ్యే అవకాశం ఉంది. వార్డు మెంబర్లకు 2024 కుల సర్వే ఆధారంగా, సర్పంచ్‌లకు 2011 జనాభా లెక్కల ఆధారంగా రిజర్వేషన్ కల్పించనున్నారు. జీవో 46 ప్రకారం రిజర్వేషన్లు ఖరారు కానున్నాయి. 2019లో జరిగిన ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించిన చోట ఆయా ప్రాంతాల్లో ఎన్నికల్లో జరగకపోతే వచ్చే ఎన్నికల్లో గతంలో చేసిన రిజర్వేషన్లను అమలు చేయనున్నారు. జనాభా ప్రాతిపాదికన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సర్పంచ్ పదవులను కేటాయిస్తారు. ఇక బీసీలకు ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ప్రయత్నాలు చేసినా, బ్రేక్ పడటంతో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 50శాతానికి మించకుండా రిజర్వేషన్లు కల్పించడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఎన్నికల్లో రిజర్వ్ చేసిన సర్పంచ్ పదవులకు సంబంధించి అదే కేటగిరీకి తిరిగి రిజర్వేషన్ చేసే అవకాశాలు లేవు. ఆయా ప్రాంతాల్లో రిజర్వేషన్లు మారనున్నాయి. ఎస్టీ రిజర్వేషన్లు మొదట ఖరారు చేసి, ఎస్సీ, బీసీలకు సంబంధించి రిజర్వేషన్లు కేటాయించనున్నారు. ప్రభుత్వం జీవో జారీ చేయడంతో ఎంపీడీవోలు, ఆర్డీవోలు ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేశారు. ఆదివారం రిజర్వేషన్లను ఖరారు చేయడంతో పాటు ప్రభుత్వానికి నివేదికను పంపించనున్నారు. ఈనెల 23న ఉదయం 10.30గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో మహిళ వార్డు సభ్యుల పదవులకు రిజర్వేషన్లను లాటరీ ద్వారా ఎంపిక చేయనుండగా మధ్యాహ్నం 1గంట సమయంలో ఆర్డీవో కార్యాలయంలో మహిళ సర్పంచ్ పదవులకు రిజర్వేషన్లను లాటరీ ద్వారా ఎంపిక చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

నాలుగు రోజుల్లో ఎన్నికల షెడ్యూల్?

పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం వేగవంతంగా చర్యలు చేపట్టడంతో పాటు జీవోలు సైతం జారీ చేయడంతో జిల్లాలో అధికార యంత్రాంగం ఎన్నికల పనుల్లో నిమగ్నమైంది. శనివారం రాత్రి లేదా ఆదివారం రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ ముగిసే అవకాశాలు ఉండటంతో మరో నాలుగు రోజుల్లో అంటే ఈనెల 26లోగా ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది.

డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఆధారంగా

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల కోసం డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం జీవో జారీ చేసిన నేపథ్యంలో రిజర్వేషన్లు ఖరారు అవుతున్నాయి. డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా బీసీ రిజర్వేషన్‌లు ఖరారు కానున్నాయి. ప్రభుత్వం గతంలో ఇచ్చిన జీవో ప్రకారం 42శాతం రిజర్వేషన్ అమలైతే పెద్ద సంఖ్యలో బీసీలకు పదవులు లభించి ఉండేవి. కానీ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 50శాతంలోపు రిజర్వేషన్ ఉండాలని స్పష్టం చేయడంతో డెడికేషన్ కమిషన్ ఆధారంగా బీసీల రిజర్వేషన్లు ఖరారు కానున్నాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం బీసీల రిజర్వేషన్‌లు ఎలా ఉండాలనే దానిపై మార్గదర్శకాలు జారీ చేసింది. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ పాత పద్ధతిలోనే 23శాతం చొప్పున సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు రిజర్వేషన్లను ఖరారు చేస్తోంది. దీంతో బీసీలకు రిజర్వేషన్లు తగ్గనున్నాయి. ప్రభుత్వపరంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయలేని పరిస్థితి ఉన్నందున పార్టీపరంగా బీసీలకు 42శాతం వరకు అవకాశం కల్పిస్తామని కాంగ్రెస్ గతంలో బీసీలకు హామీ ఇచ్చింది.మొత్తానికి సుప్రీంకోర్టు ఆదేశాలతో గ్రామపంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లు 50శాతం మించకుండా చూస్తున్నారు.

మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. డిసెంబరు 15లోపు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు సమాచారం. ఒక్కో ఎన్నికకు సంబంధించి ప్రతీ విడతలోనూ రెండు రోజుల వ్యవధి ఉండేలా ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు సమాచారం. ఎన్నికల నిర్వహణ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పోలీస్ యంత్రాంగం...

- మిగతా 8వ పేజీలో...

హస్తం జిల్లా పగ్గాలు కైలాష్‌కే

స్థానికం వేళ డీసీసీ అధ్యక్షుల ప్రకటన

- యాదాద్రికి అయిలయ్య, సూర్యాపేటకు గుడిపాటి నర్సయ్య


పున్న కైలాష్‌నేత


బీర్ల అయిలయ్య


గుడిపాటి నర్సయ్య

నల్లగొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధిష్టానం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులను శనివారం రాత్రి ప్రకటించింది. దీంతో కొన్ని రోజులుగా నెలకొన్న ఉత్కంఠకు తెర పడింది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ బలోపేతం కోసం డీసీసీ అధ్యక్షులను నియమించింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పున్న కైలాష్‌నేతను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ.వేణుగోపాల్ ప్రకటించారు. ప్రస్తుతం టీపీసీసీ అధికార ప్రతినిధిగా ఉన్న కైలాష్‌నేత గతంలో మునుగోడు అసెంబ్లీ నుంచి, భువనగిరి పార్లమెంట్ నుంచి టికెట్‌ను ఆశించారు. ఆరు నెలలుగా అధ్యక్ష పదవికి చాలా మంది పోటీపడుతూ రాగా, చివరికి బీర్లకు పదవి వరించింది. స్థానిక ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతం కోసం అధిష్టానం ఈ నిర్ణయం తీసుకుంది. యాదాద్రి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను ప్రకటించారు. సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా తుంగతుర్తి మండలం వెలుగుపల్లికి చెందిన గుడిపాటి నర్సయ్యను నియమించారు. ఆయన 2009లో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. 2001లో ఆయన జడ్పీటీసీగా గెలుపొందారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



7

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

6

యువత ఇతర రంగాల్లోనూ రాణించాలి

అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్


యువజనోత్సవాల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): యువత చదువులోనే కాకుండా, సంస్కృతి, కళలు, సాహి త్యం, పెయింటింగ్ రంగాల్లో కూడా రాణించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. శనివారం కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి మెమోరియల్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన ఉత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సం దర్భంగా మాట్లాడుతూ, నేటి యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. యువత అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి అక్బర్ అలీ, కళాశాల ప్రిన్సిపాళ్లు ఉపేందర్, రాకేంద్, బొజ్జ అనిల్, మనిషా సింగ్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు రైస్ మిల్లులు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


మహిళా శక్తి చీరలను పంపిణీ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో మహిళల కోసం ఉచిత బస్సు సౌకర్యం, బస్సులు, పెట్రోల్ బం కులు, మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణను అప్పగించిందని, వారికి రైస్ మిల్లులు నిర్వహించే బాధ్యతలు కూడా అప్పగించాలని యోచిస్తున్నట్టు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో ఇందిర మహిళా శక్తి చీరల పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పైలెట్ పద్ధతిన జిల్లాలో మహిళలతో రైస్ మిల్లులు ఏర్పాటు చేయిస్తామన్నారు. వీటిని ఆర్‌అండ్‌బీశాఖ ద్వారా నిర్మిస్తామన్నారు. దీంతో జిల్లాలో రైస్ మిల్లుల కొరతను తీరుస్తామన్నారు. మిల్లుల ఏర్పాటుకు స్థలాలు చూడాలని కలెక్టర్‌ను ఆదేశించా రు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లి వచ్చే క్యాబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. మహిళలు స్వయంకృషితో పైకి వచ్చేందుకు పెట్రోల్ పంపులు కేటాయించామన్నారు. జిల్లా లో రద్దీ ప్రాంతంలో ఎస్ఎల్‌బీసీలో ఏర్పాటు చేసిన పెట్రోల్ పంపు ద్వారా ప్రతీ నెల రూ.10లక్షల ఆదాయం పొందే అవకాశం కల్పించామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళల ఆత్మగౌరానికి పెద్దపీట వేసిందన్నారు. సీఎంతోపాటు మంత్రివర్గం చర్చించి నాణ్యమైన చీరలు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రస్తుతం జిల్లాకు 65లక్షల చీరలు వచ్చాయని, మరో 35లక్షలు రాగానే మహిళలకు పంపిణీ చేస్తామన్నారు. మహిళలు పిల్లలను బాగా చదివించాలని సూచించారు. కుట్టుమిషన్ శిక్షణ ఇచ్చేందుకు, ఇతర నైపుణ్యాల అభివృద్ధి కోసం న్యాక్ ద్వారా భవనాన్ని నిర్మిస్తున్నామని, త్వరలోనే పనులు పూర్తయితాయని తెలిపారు. వచ్చే మూడేళ్లలో నియోజకవర్గంలో 10వేల ఇళ్లు కట్టించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రూ.400కోట్లతో జిల్లాలో డబుల్ రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందని, అందులో బాగానే నాణ్యమైన చీరలు పంపిణీ చేస్తోందన్నారు. అనంతరం మంత్రి రూ.2.20కోట్ల విలువచేసే కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ హఫీజ్‌ఖాన్, ఇన్‌చార్జ్ డీఆర్వో అశోక్‌రెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మాధవి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూఫూడి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ సంపత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లకు ఇబ్బందులు రాకుండా చర్యలు

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ): అభివృద్ధి పనులను పూర్తిచేసిన కాంట్రాక్టర్లకు ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. చిన్న కాంట్రాక్టర్లకు మంత్రి కోమటిరెడ్డి కృషితో బిల్లులు మంజూరవడంతో శనివారం కాంట్రాక్టర్స్ క్లాస్ థర్డ్ అసోసియేషన్ నాయకులు ఆయన్ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కాంట్రాక్టర్లకు సమస్యలు రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో క్లాస్ థర్డ్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కాకోల రామలింగయ్య, కార్యదర్శి పోతేపాక చంద్రశేఖర్, ఉపాధ్యాక్షులు ఓర్సు ఇద్దయ్య, బొంత ఎల్లయ్య, కార్యదర్శి ఓర్సు కల్యాణ్, ఉప కార్యదర్శి మహ్మద్ జానీ, సభ్యులు ఆలకుంట్ల నాగరాజు, వేముల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత నీరు అందించేందుకు చర్యలు


పర్యటన వివరాలు వెల్లడిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో ఏపీ రాష్ట్రం విశాఖపట్టణంలో డ్రింక్ ఫ్రం ట్యాప్ అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌నకు హాజరైనట్టు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగిన శిబిరంలో డ్రింక్ ఫ్రం ట్యాప్(డీఎఫ్‌టీ) విధాన అమలులో గ్రేటర్ వైజాగ్ మునిసిపల్ కార్పొరేషన్ సాధించిన పురోగతి, నీటి సరఫరా వ్యవస్థలను పరిశీలించినట్లు తెలిపారు. అమృత్-2 పథకం ద్వారా ప్రజలకు 24గంటలు నీటిని అందించడం, నల్లాల ద్వారా సరఫరా అయ్యే నీరు నేరుగా తాగేందుకు అవసరమైన వ్యవస్థను ఏర్పాటు చేయడమే వర్క్‌షాపు ప్రధాన ఉద్దేశమన్నారు. పట్టణంలో డీఎఫ్‌టీ విధానం అమలుకు చర్యలు చేపట్టామని, పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు.

42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ ప్రసన్నకుమార్


సమావేశంలో మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

నల్లగొండ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, అందుకు 50శాతం పరిమితిని ఎత్తివేయాలని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ మునాసు ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. శనివారం బీసీ జేఏసీ జిల్లా కార్యాలయంలో వివిధ కులసంఘాలు, రాజకీయ పార్టీల నేతలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి వచ్చే పార్లమెంట్ సమావేశంలో బీసీ బిల్లు, తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. వాటిని సాధించేంతవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యాక ఎన్నికలను నిలపవద్దని గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయని, దానికి విరుద్ధంగా వాయిదా వేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. ఈ నిర్ణయింతో రాష్ట్రంలోని 56శాతం బీసీ ప్రజల హక్కులకు విఘాతం కలిగిస్తోందన్నారు. దుడుకు లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు చీర పంకజ్‌యాదవ్, కొలగాని పర్వతాలు, గుంటోజు వెంకటాచారి, చిలకరాజు చెన్నయ్య, మిర్యాల యాదగిరి, అయితగోని జనార్ధన్‌గౌడ్, అబ్దుల్ ఖదీర్, గజ్జి అజయ్‌యాదవ్, మార్గం సతీష్, చిలకరాజు సతీష్‌కుమార్, వడ్డెబోయిన రామకృష్ణ, చెన్నూరి భరద్వాజ్ యాదవ్, అనంత నాగరాజుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.


ఎన్‌కౌంటర్‌పై విచారణ చేయించాలి


నల్ల బ్యానర్‌తో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

నల్లగొండ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను నిరసిస్తూ శనివారం జిల్లా కేంద్రంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద నల్ల బ్యానర్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దేశంలో బీజేపీ మోదీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టు నేత హిడ్మా సహా ఆరుగురిని ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపారన్నారు. ఈ ఎన్‌కౌంటర్లన్నీ బూటకమని వీటిపై న్యాయవిచారణ చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు సాగర్, సీహెచ్.సుధాకర్‌రెడ్డి, పన్నాల గోపాల్ రెడ్డి, పాలడుగు నాగార్జున, పందుల సైదులు, బొంగరాల నర్సింహ, బొమ్మిడి నగేష్, ఎండీ. సలీం, అవుట రవీందర్, బీవీ.చారి, మల్లం మహేష్, విజయ్‌కుమార్, పాల్గొన్నారు.

ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనడం అశాస్త్రీయం

టీఆర్‌జీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు రవినాయక్


సమావేశంలో మాట్లాడుతున్న టీఆర్‌జీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు రవినాయక్

మిర్యాలగూడ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలనడం అశాస్త్రీయమని తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రవినాయక్ అన్నారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గిరిజన తెగల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టేందుకు కొందరు ప్రయత్నించడం క్షమించరానిదని అన్నారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే డిమాండ్ రాజ్యాంగ విరుద్ధమన్నారు.

గిరిజన చైతన్య యాత్రలు నిర్వహించి ప్రజలకు ఈ విషయాలను వివరించేందుకు భవిష్యత్‌లో చేపట్టే కార్యక్రమాలపై ఈ నెల 29న రాష్ట్ర కమిటీ సమావేశంలో చర్చించనున్నట్టు తెలిపారు. నల్లగొండలోని లెక్చరర్స్ భవన్‌లో నిర్వహించనున్న రాష్ట్ర కమిటీ సమావేశంలో టీఆర్‌జీఎస్ క్రియాశీలక కార్యకర్తలందరూ పాల్గొనాలని కోరారు. సమావేశంలో గిరిజన సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీను నాయక్, నాయకులు రమేష్ నాయక్, అశోక్‌నాయక్, శ్రీనునాయక్, సైదానాయక్, నాగానాయక్, వస్రాంనాయక్ పాల్గొన్నారు.

బొమ్మ పడితేనే.. బులుగు చీర!

- చీర పొందాలంటే ఫొటో దిగాల్సిందే
- సెర్ప్ ప్రొఫైల్ యాప్‌లో నమోదవ్వాల్సిందే
- ఇందిర మహిళా శక్తి చీరల పంపిణీకి నిబంధన
- యాప్ సర్వర్ సమస్య ఎదురవుతుందనే సందేహం?



నార్కట్‌పల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): యూనిఫాం పేరుతో పొదుపు సంఘాల మహిళలకు ప్రభుత్వం అందజేస్తున్న ఇందిరా మహిళా శక్తి (నీలి రంగు) చీరల పంపిణీకి ఫొటో దిగాలనే నిబంధన విధించింది. చీరల పంపిణీలో పారదర్శకత కోసమే ఈ నిబంధన పెట్టినట్లు అధికారులు చెబుతున్నారు. అందుకోసం ఓ యాప్‌ను కూడా రూపొందించారు. పొదుపు సంఘాల మహిళలు ప్రభుత్వం అందజేసే చీరను పొందాలంటే కచ్చితంగా వీవోఏల వద్ద ఉండే మొబైల్ ఫోన్‌లోని యాప్‌లో ఫొటో నమోదవ్వాల్సి ఉంది. ఈ నిబంధన ప్రకారమే చీరను పొందే అవకాశముంది. లేదంటే చీర పొందడం కుదరదు.

జిల్లా వ్యాప్తంగా 4,24,400 చీరల పంపిణీ

జిల్లా వ్యాప్తంగా 33 మండలాలకు చెందిన పొదుపు మహిళలు, పొదుపు సంఘాల్లో లేని మహిళలు కలిపి సుమారు 4,24,400 మందికి ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేసేందుకు డీఆర్‌డీఏ అధికారులు ఇప్పటికే జాబితా సిద్ధం చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చింతపల్లి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మిర్యాలగూడలోని గోదాములను స్టాక్ పాయింట్‌లుగా చీరలను నిల్వచేశారు. స్టాక్ పాయింట్ల వారీగా కేటాయించిన మండలాలకు చీరల చేరవేత దాదాపు పూర్తికావొచ్చింది. మిర్యాలగూడ స్టాక్ పాయింట్ పరిధిలోని 13 మండలాలకు 1,59,500 చీరలు, చింతపల్లి స్టాక్ పాయింట్ పరిధిలో ఉన్న 20 మండలాలకు 2,64,900 కలిపి మొత్తం జిల్లాలో 4,24,400 చీరలను పంపిణీ చేయనున్నారు.

సెర్ప్ ప్రొఫైల్ యాప్

ఇందిరా మహిళా శక్తి చీరలను...

మిగతా 8వ పేజీలో...

కాల్వ భూములు మాయం



కాల్వ భూములను ఆక్రమించుకోని సేద్యం చేస్తున్న రైతులు

- కాల్వకు ఇరువైపులా భూముల ఆక్రమణ
- కాల్వలు లేకుండా భూములను సాగు చేస్తున్న రైతులు
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు

మాడ్గులపల్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాష్ట్రంలో కోటి ఎకరాల మాగాణిగా మార్చాలన్న లక్ష్యంతో బడ్జెట్‌లో భారీ నిధులు కేటాయించి పనులు చేపడుతోంది. క్షేత్రస్థాయిలో మాత్రం అధికారుల అలసత్వంతో పలువురు కాల్వ భూములను కబ్జా చేస్తుండటంతో ఆయకట్టుకు నీరందకుండా పోతుంది. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదని పలువురు రైతులు పేర్కొంటున్నారు. కాల్వ భూములు ఆక్రమణకు గురవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు ఇష్టానుసారంగా కాల్వ భూములను ఆక్రమించుకోవడంతో పాటు దారులు లేకుండా పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. 1963లో మూసీ కుడికాల్వ పరిధిలోని 36 డిస్ట్రిబ్యూటర్ కాల్వ కింద రైతులకు నీరందించేందుకు భూసేకరణ చేపట్టారు. రైతులకు భూసేకరణ కింద ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించింది. రైతులకు కాల్వకు ఇరువైపులా మొత్తం 32 ఫీట్లు కాల్వ ఉండే విధంగా డిజైన్ చేసి తూములను ఏర్పాటు చేశారు. కొంతమంది రైతులు ప్రభుత్వ కాల్వలను ధ్వంసం చేస్తూ కాల్వ భూములను ఆక్రమిస్తున్నారు. మండలంలోని కల్వలపాలెం గ్రామంలో ఎల్-20 లిఫ్టు పరిధిలోని సుమారు 900ఎకరాల ఆయకట్టు ఉంది. కల్వలపాలెం గ్రామ శివారులోని సుమారు 450 ఎకరాల ఆయకట్టు విస్తీర్ణం ఉంది. కాల్వకు ఇరువైపులా రహదారులు లేకుండా పోవడంతో రైతులు నానా అవస్థలు పడాల్సి వస్తుంది. పొలాలు దున్నేటప్పుడు బాటలు లేకపోవడం, కాల్వ భూములను ఆక్రమించుకోవడంతో రైతులు నీళ్ల కోసం రాత్రి సమయంలో తిరగలేని దుస్థితి నెలకొంది. గతంలో రైతులు ఈ కాల్వ వెంబడి బాట మీద నుంచి ట్రాక్టర్లు, పశువులను తీసుకెళ్లేవారు. ప్రస్తుతం బాటలు క్రమంగా కనుమరుగు కావడంతో ఎక్కడికక్కడ పక్కన ఉన్న రైతులు దారి లేకుండా చేయడంతో పాటు కాల్వ నీళ్లు కింది రైతలకు పారకుండా ఆటకం ఏర్పరుస్తున్నారు.

పరిధి దాటి ఆక్రమణలు..

ఎల్-20 కాల్వకు పక్కన ఉన్న పట్టా భూములు కలిగిన కొందరు రైతులు కాల్వలను పూర్తిగా ఆక్రమించి ప్రభుత్వం గతంలో నిర్మించిన రాప్‌లను పూర్తిగా ధ్వంసం చేసి కాల్వ భూములను ఆక్రమిస్తున్నారు. ఎల్-20 కాల్వ పరిధిలో గల 3 కిలోమీటర్ల మేర సల్కునూరు రోడ్డు వరకు కాల్వ ఉన్నా కేవలం 1.5 కిలోమీటర్ల మేర మాత్రమే ఒక్క సైడ్ పూర్తిగా, మరో సైడ్ కొద్ది మేర ధ్వంసం చేసి ఆక్రమణలు చేపట్టి సేద్యం చేశారు. దీంతో కింది రైతులకు నీరందకపోవడంతో కాల్వ వెంబడి రైతులు నీటి కోసం తిరగలేని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా లిఫ్టు నీళ్లను చివరిదాక అందించేందుకు కాల్వలు ఉన్నా రాత్రి వేళల్లో నీళ్ల కోసం రైతులు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. పంటలు చేతకొచ్చే సమయంలో కోత మిషన్లు, ట్రాక్టర్లు ధాన్యాన్ని తీసుకురావడానికి రాలేని పరిస్థితి ఉంది. దీంతో కిలోమీటర్ల మేర ట్రాక్టర్లను రోడ్లపై ఉంచి ధాన్యాన్ని తీసుకురావాల్సి వస్తుందని పలువురు రైతులు వాపోతున్నారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోవడంతోపాటు కనీసం కాల్వ వెంట నడవలేకుండా ఉంది. గతంలో నిర్మించిన కాల్వలను కాకుండా స్వతహాగా కాల్వలను కూడా గతంలో నిర్మించిన డిజైన్‌కు విరుద్ధంగా కాల్వలను జరుపుతూ కింది రైతులకు ఆటంకం పరుస్తున్నారు. కాల్వ చివరి దాకా లేకపోవడంతో నీరంతా వృథాగా పాలేరు వాగులో కలిసిపోతుంది. దీంతో కింది రైతులకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. నీరు కింది వరకు సజావుగా సాగితే సుమారు 150 ఎకరాల మేర ఆయకట్టు పెరుగుతుంది. ఈ విషయమై అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అదికారులు స్పందించి గతంలో నిర్మించిన నక్ష ప్రకారం కాల్వల పునరుద్ధరణ చేసి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆక్రమించిన కాల్వ భూములను వెలికితీయాలి



ఆక్రమణకు గురైన ఎల్-20 కాల్వ భూములను వెలికితీసి చివరి రైతులకు నీరందించేందుకు కృషి చేయాలి. రాత్రి వేళల్లో కాల్వలో సాగునీరు పెట్టడానికి వెళ్లాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తుంది. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి గతంలో తీసిన నక్ష ప్రకారం కాల్వ పునరుద్ధరణ పనులు చేపట్టాలి. ఇరువైపులా కాల్వ భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని బాటను పునర్నిర్మించాలి.

- చిట్యాల ఎల్లయ్య, రైతు, కల్వలపాలెం

ప్రభుత్వ కాల్వలను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు

ప్రభుత్వ కాల్వలను ఆక్రమించి ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. కాల్వలను ఆక్రమించి భూములను సాగు చేసిన రైతుల నుంచి ఆ కాల్వ పునరుద్ధరణ పనులు చేపట్టి రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. ప్రభుత్వ కాల్వలను ఆక్రమిస్తే ఎంతటి వారిపైనా చర్యలు తీసుకుంటాం.

- సాయిరెడ్డి, ఇరిగేషన్ ఏఈఈ

నేడు మెగా కార్డియాక్ వైద్యశిబిరం

మిర్యాలగూడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంజిరెడ్డి రివర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నేడు కార్డియాక్ మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల వరకు వైద్యశిబిరాన్ని కొనసాగిస్తామన్నారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ వెంకట్ రావు, జర్నల్ మెడిసిన్ డాక్టర్లు సాయికుమార్, సు మంత్ వైద్యశిబిరానికి హాజరయ్యే రోగులను పరీక్షిస్తారన్నారు.

ఈ శిబిరానికి హాజరయ్యే వారికి బీపీ, జీఆర్‌బీఎస్, ఈసీజీ, 2డీ-ఎకో, టీ ఎంటీ పరీక్షలు ఉచితంగా నిర్వస్తామన్నారు. వైద్య శిబిరానికి వచ్చే వారంతా తమ పాత వైద్య రిపోర్టులతో పాటు తెల్లరేషన్‌కార్డు లేదా ఆరోగ్యశ్రీ కార్డును తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి ఎండీ కోరారు.

మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న ఆకారపు నరేష్

హాలియా, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆకారపు నరేష్ అన్నారు. శనివారం హాలియాలోని త్రివేణి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో నాగార్జునసాగర్ డివిజన్ ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వెన్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షీ టీమ్స్ ఎక్కడ కూడా సరిగా పనిచేయడం లేదని, మహిళలపై అత్యాచారాలు రోజు రోజుకి పెరిగిపోతున్నాయని అన్నారు. అనంతరం జిల్లా కన్వెన్షన్ కమిటీ 19 మంది సభ్యులతో ఎన్నుకున్నారు. జిల్లా గర్ల్స్ కన్వీనర్‌గా ఎం.పరిమళ, జిల్లా కోకన్వీనర్లుగా భవాని, సహస్ర, వర్షిత, నవ్య, మాధవి, శ్రావణి, శ్రీలత, సంధ్య, అనిత, శ్రీసాయిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, కోరే రమేష్, చందన, సిరి, అస్మిత, సింధు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్లు కల్పించాలి

మిర్యాలగూడటౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తరతరాలుగా మోసపోతున్న బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్లు కల్పించాలని సంక్షేమ సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్ డిమాండ్ చేశారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాజకీయ పార్టీలు రిజర్వేషన్ల అమలుపై ఆడుతున్న నాటకాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలన్నారు. తూచా తప్పకుండా 42శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేసేలా రాజకీయ పార్టీలు పని చేయాలని, లేనిచో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయా పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు కర్నాటి శివరామకృష్ణ, ఎరుకల మల్లేష్‌గౌడ్, పోగుల నర్సింహ, సంతోష్‌కుమార్, సన్నీ, కృష్ణ, గోపీ తదితరులు పాల్గొన్నారు.

పటేల్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీవో రమణారెడ్డి, సీఐ వెంకట్‌రెడ్డి

దేవరకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుడు, దేశ మొట్టమొదటి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని ఆర్డీవో రమణారెడ్డి అన్నారు. శనివారం దేవరకొండలో స్పోర్ట్స్ అసోసియేషన్, మేరా యువ భారత్ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతిని పురస్కరించుకొని జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీని ఆర్డీవో రమణారెడ్డి, సీఐ వెంకట్‌రెడ్డి, స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీలు ప్రారంభించి మాట్లాడారు. పటేల్ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేశారని, సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేయడంలో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గాజుల రాజేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మద్దిలేటి సుధాకర్, నాయక్, నరేందర్‌రెడ్డి, నక్క వెంకటేష్, నిరంజన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

గుర్రంపోడు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చామలోనిబావి గ్రామంలో అనారోగ్యానికి గురైన వారికి ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన రామసాని అండాలుకు రూ.60వేలు, మట్టిపల్లి లింగయ్యకు రూ.12వేలు, స్వరూపకు రూ.38వేలు, శ్రీనివాస్‌రెడ్డికి రూ.60వేల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ఎరుకల శంకర్‌గౌడ్, రామసాని సుధీర్‌రెడ్డి, శిరందాసు నర్సింహ, వలికి ప్రభాకర్, శంకరయ్య, ఆంజనేయులు, చాంద్‌పాష పాల్గొన్నారు.

సాగు భూమికి దారి ఇప్పించండి

మిర్యాలగూడ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సాగు భూమికి కొందరు దారి ఇవ్వక పోవడంతో వానాకాలం బీడు ఉంచాలని సాగు చేసుకునేందుకు దారి ఇప్పించాలని అన్నారం గ్రామానికి చెందిన రైతు దానావత్ కిషన్‌నాయక్ కోరారు. శనివారం సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం తన పొలం సాగు చేసుకునేందుకు తన పొలంలో వద్దకు వెళ్లగా అన్నారానికి చెందిన పలువురు అడ్డుకున్నారని అన్నారు. ఈ విషయమై రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా భూమి వద్దకు వచ్చి సర్వే చేసినా నివేదిక ఇవ్వకపోవడంతో వానాకాలం ఎకరం భూమిని సాగు చేయకుండా బీడుగా ఉంచాల్సి వచ్చిందని అన్నారు. రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినా తనకు న్యాయం చేయలేదని అన్నారు. పొలానికి దారి ఇప్పించి తనకు న్యాయం చేయాలని సబ్ కలెక్టర్‌కు అందజేసిన వినతిపత్రంలో కోరినట్లు ఆయన తెలిపారు.

పంచాయతీలకు రిజర్వేషన్ల ఖరారు నేడు

(5వ పేజీ తరువాయి)

సైతం తగిన సమయం ఉండేలా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఈ నేపథ్యంలో రెండు రోజుల వ్యవధి చొప్పున మూడు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తే పోలీస్ బందోబస్తుకు ఇబ్బంది ఉండదని పోలీసులు యోచిస్తున్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల రిజర్వేషన్‌ను పాత పద్ధతినే 50శాతాని కి లోబడి రోటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు ఖరారు కానున్నాయి. గ్రామపంచాయతీలకు కేంద్రం నుంచి కోట్ల రూపాయల నిధులు రావాల్సి ఉండటంతో ప్రభుత్వం ఈ ఎన్నికలను త్వరితగతిన నిర్ణయించాలని భావించడంతో అందుకు అనుగుణంగా వేగవంతంగా అడుగులు పడుతున్నాయి. పంచాయతీ ఎన్నికలు పూర్తయి పాలకవర్గం బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆర్థిక సంఘం నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయనుంది.


మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యేలు బాలునాయక్, జైవీర్‌రెడ్డి
- పొదుపు సంఘాల మహిళలకు చీరలు పంపిణీ చేసిన ఎమ్మెల్యేలు



దేవరకొండలో మహిళా సంఘాలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మహిళ సంక్షేమానికి తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యేలు నేనావత్ బా లునాయక్, కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. దేవరకొండ మార్కెట్‌యార్డులో శనివారం మహిళ సంఘాలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసి మాట్లాడారు. నియోజకవర్గంలో 68 వేలకు పైగా మహిళ సంఘాల సభ్యులకు చీరలను పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మహిళ సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణం, మహిళ శక్తి కార్యక్రమాలు, గృహలక్ష్మీ వంటి పథకాలను ప్రవేశపెట్టి మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం తోడ్పాటనందిస్తుందన్నారు.



హాలియాలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ నారాయణఅమిత్

ఇందిరమ్మ చీరలు తెలంగాణ సాంస్కృతికి చిహ్నమని ఆయన తెలిపారు. మహిళలకు మరిన్ని పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కా ర్యక్రమంలో దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, ఎంపీడీవో డానియెల్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, మహిళ సంఘాల అధికారులు విజయలక్ష్మీ, నాగలీల, ఏపీఎం సరస్వతి, ఎండి.సిరాజ్‌ఖాన్, వెంకటయ్యగౌడ్, హనుమంతు వెంకటేష్‌గౌడ్, మహిళ సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీల అభివృద్ధికి కృషి

దేవరకొండ: పద్మశాలీల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం దేవరకొండ పట్టణంలోని సాయిరమ్య ఫంక్షన్‌హాల్‌లో జరిగిన పద్మశాలీ సంఘం ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరై పాల్గొన్నారు. ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. మార్కండేయస్వామి దేవాలయానికి సీసీరోడ్ల నిర్మాణం, అలయ అభివృద్ధికి సహకరించినట్లు తెలిపారు. దేవరకొండలో పద్మశాలీ భవన నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. అనంతరం శ్రీశైలం దేవస్థాన బోర్డు సభ్యుడిగా నియమితులైన సిలువేరు కాశీనాథ్‌ను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, మహిళ అధ్యక్షురాలు వనం దుశ్యంతల, రాష్ట్ర అధ్యక్షుడు మురళి, రూప, మాజీ సర్పంచ్ పున్న వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్, నాయకులు నాగరాజు, వినయ్, బాలరాజు, నరేందర్, వనం చంద్రమౌళి, పుష్పలత పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట

హాలియా: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో మహిళా సాధికారితకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. శనివారం హాలియాలోని లక్ష్మీనర్సింహ గార్డెన్స్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమానికి ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం పథకంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలి సంతకాన్ని పెట్టి వారిపై గౌరవాన్ని చాటినట్లు తెలిపారు. రెండేళ్లలో నాగార్జునసాగర్ నియోజకవర్గంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో మహిళా శక్తి పెట్రోల్ బంకు మంజూరైందని, త్వరలోనే ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయంపై స్పష్టత ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ నారాయణఅమిత్, హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, ఇరిగి పెద్దులు, డీఈవో బిక్షపతి, వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, తహసీల్దార్ రఘు, పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, టౌన్ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, ఎంపీడీవోలు సుజాత, విజయలక్ష్మీ, ఏపీఎం లక్ష్మీనారాయణ, ఆర్.ఐ. నవీన్, నాయకులు కాకునూరి నారాయణగౌడ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న కేంద్రం



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సైదులు

హాలియా, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): యావత్ కార్మిక వర్గాన్ని పొట్ట కొట్టే విధంగా 29 కార్మిక చట్టాలను రద్దు చేసి బడా పెట్టుబడిదారులకు కేంద్ర బీజేపీ ప్రభుత్వం కొమ్ముకాస్తుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు అన్నారు. శనివారం హాలియాలో నిర్వహించిన సీఐటీయూ మండల మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. ఎందరో ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న చట్టాలను రద్దు చేయడం వల్ల చిన్న పరిశ్రమల్లో తనిఖీలు ఉండవని, యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తాయని అన్నారు. ఫిక్స్‌డ్ వేతనంతో పని గంటలు పెంచుతూ కార్మికులను వెట్టి చేయించే విధంగా చట్టాలను తెచ్చినట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 26వ తేదీన సీఐటీయూ రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘాలు తలపెట్టిన ఆందోళన కార్యక్రమంలో కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కూలీలు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అనుముల మండల నూతన కమిటీ ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా రెబెల్లి వెంకటేశ్వర్లుతో పాటు మరో 16మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీర్, నాయకులు పొదిల వెంకన్న, అన్నెపాక శ్రీను, చాంద్‌పాషా, బూరుగు వెంకన్న, తోటిపల్లి వెంకటయ్య, నర్సిం హ, సైదమ్మ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



అల్వాల గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవనానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

తిరుమలగిరి(సాగర్), నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని హాలియా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, డీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ గడ్డం సాగర్‌రెడ్డి అన్నారు. శనివారం అల్వాల గ్రా మంలో రూ.20లక్షల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనానికి వారు శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలను చేరువ చేసేలా ప్రభుత్వం కృషి చే స్తుందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ విజయం సా ధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంకీస్ పాపిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమావత్ కృష్ణానాయక్, నాయకులు పల్‌రెడ్డి నర్సింహారెడ్డి, అనుముల అంజి, ఆంగోతు శ్రీనునాయక్, పల్‌రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సైదానాయక్ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మ పడితేనే.. బులుగు చీర !

(5వ పేజీ తరువాయి)

పొందాలంటే మహిళలు సెర్ప్ ప్రొఫైల్ యాప్‌లో ఫొటో దిగాల్సి ఉంది. ఇప్పటికే వీబీకేలు (విలేజ్ బుక్ కీపర్) వారి మొబైల్ ఫోన్‌లలో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నారు. ఓ మహిళకు చీర అందజేయాలంటే యాప్‌లో గ్రామం, కోడ్ నెంబర్, సమభావన సంఘం పేరు నమోదు చేయగానే సంఘంలోని సభ్యుల వివరాలు వస్తాయి. జాబితాలోని సదరు మహిళ పేరుపై క్లిక్ చేసి చీరను అందుకునే మహిళ ఫొటోను క్యాప్చర్ చేయాల్సి ఉంటుంది. అది విజయవంతంగా నమోదై, వివరాలు ఫొటో సహా సెర్ప్ ప్రొఫైల్ యాప్‌లో నిక్షిప్తమవుతాయి. ఆ తర్వాతే మహిళకు సంబంధిత చీరను వీబీకే అందజేస్తారు. దీంతో పాటు మరో దస్త్రంలో పేరు, ఆధార్ వివరాలను కూడా నమోదు చేస్తారు.

సర్వర్ సమస్య ఎదురవుతుందేమో?

చీరల పంపిణీలో పారదర్శకత కోసం యాప్ విధానాన్ని ప్రవేశపెట్టినప్పటికీ ఆచరణలో సర్వర్ సమస్యలు ఎదురవుతాయనే సందేహం వీబీకేల్లో వ్యక్తమవుతోంది.

కొద్ది రోజుల్లో స్థానిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రభుత్వం కూడా ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీని ప్రాధాన్యంగా భావించి ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చినట్లు తెలిసింది. ప్రభుత్వ ప్రజాప్రతినిధుల ద్వారా ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించాక ఒకటి రెండు రోజుల్లోనే మి గతా అందరికీ చీరల పంపిణీని పూర్తిచేయాలని మౌఖిక ఆదేశాలిచ్చినట్లు సమాచారం.

అయితే చీరల పంపిణీకి ఎక్కువ సమయం ఇవ్వకపోవడం పైగా రాష్ట్రమంతటా ఏకకాలంలో వీబీకేలు యాప్‌లో వివరాలు ఫొటో క్యాప్చర్ చేయాల్సి ఉండటంతో సర్వర్ సమస్యలు ఎదురవుతాయని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్

మిర్యాలగూడటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బీసీలను మరోమారు మోసం చేస్తోందని బీసీ యువజన సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. శనివారం బీసీ భవన్‌లో మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ అవి అమలయ్యాకే స్థానిక సంస్థలఎన్నికలకు వెళ్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. బీసీలను నిర్లక్ష్యం చేసినా, చిన్న చూపు చూసినా సహించేది లేదని ఆయన అన్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణ భూమి పూజ నేడు

మిర్యాలగూడటౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించనున్నట్లు విశ్వ హిందూ పరిషత్, శివాజీ యువసేన శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపాయి. ఉదయం 9.30గంటలకు సాగర్‌రోడ్డులోని శకుంతల థియేటర్ ఎదుట నిర్వహించే భూమి పూజకు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

వీటీనగర్‌లో నేడు సత్యసాయి జయంతి

చింతపల్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్(మాల్) సాయిమందిర్‌లో సత్యసాయి జయంతిని ఆదివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. ప్రాంగణానికి వివిధ రకాల పువ్వులతో అలంకరించి సుందరమనోహరంగా తీర్చిదిద్దారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పాఠశాలకు బెంచీల అందజేత

చింతపల్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని నసర్లపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంచాలకు చెందిన చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో 20 బెంచీలు, పుస్తక సామగ్రిని శనివారం అందించారు. భార్గవ్ జ్ఞాపకార్థం విద్యార్థులకు సంక్షేమానికి స్వచ్ఛందంగా ఎన్నో కార్యక్రమాలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అజయ్ కుమార్‌రెడ్డి, కృష్ణ, అనిల్, తరుణ్, సుజిత్, రమేష్, శివ, నవీన్, పంచాయతీ కార్యదర్శి వినోద్ రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటయ్య, మాజీ ఉప సర్పంచ్ మల్లయ్య, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటయ్య, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా అంజయ్య



లింగంపల్లి అంజయ్య

నిడమనూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా లింగంపల్లి అంజయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని ఎర్రబెల్లిలో శనివారం నిర్వహించిన సంఘం మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా లింగంపల్లి అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా నలిగంటి ప్రతాప్, ఉపాధ్యక్షులు అశ్వినికుమార్, ఝాన్సీ, కోశాధికారిగా యాదగిరిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శి నలపరాజు వెంకన్న ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బక్కా శ్రీనివాసాచారి, పెరుమాళ్ల వెంకటేశం, శ్రీనివాస్‌రెడ్డి, కొమరాజు సైదులు, సుశీల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, తమ ఎన్నికకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మోడల్ స్కూల్‌లో ఏక్ భారత్, శ్రేష్ట భారత్

నిడమనూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పీఎం శ్రీస్కూల్స్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఏక్ భారత్, శ్రేష్ట భారత్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు వివిధ రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయలు ఉట్టి పడే విధంగా పలు వేషధారణతో ఆకట్టుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రతీ ఒక్కరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఫుడ్ ఫెస్టివల్‌ను కూడా ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు స్వయంగా వివిధ రకాల వంటకాలు తయారు చేసి తీసుకువచ్చి ప్రదర్శించారు. విద్యార్థులు తయారు చేసిన వివిధ వంటకాలను అధ్యాపకులు రుచి చేసి విద్యార్థులను అభినందించారు. అదేవిధంగా మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 28న నల్లగొండలో నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీలో పాల్గొననున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బూరుగు నిర్మల, ఉపాధ్యాయులు సయ్యద్, సలీం, ఏడుకొండలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.